తరంగాలు

రిపోర్టర్లు కావలెను

అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.

సంప్రదించండి...

ఎడిటర్: గడ్డం నాగరాజు గౌడ్

94949 23460



https://epaper.tharangalu.in

RNI. TELTEL / 2022 / 83463

జాతీయ దిన ప్రతిక

# తరంగాలు

Tharangalu Daily News Paper

ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
ఆదివారం
19 జులై 2026
సంపుటి 03
సంచిక 278
పేజీలు 8
వెల రూ.5.00

Published From : Hyderabad,Circulated:Telangana,Andhrapradesh

Epaper: www.tharangalu.in.com


# ఆహార కల్తీపై ఇక ఉక్కుపాదం



- ప్రజల ప్రాణాలతో చెలగామడితే కఠిన చర్యలు
- ఆహార కల్తీ నిరోధానికి పటిష్టమైన చట్టం
- ప్రపంచ దేశాల్లో అమలవుతున్న విధానాలపై అధ్యయనం
- సేంద్రియ ఉత్పత్తుల పేరుతో విచ్చలవిడిగా అమ్మకాలు
- వాటి స్వచ్ఛతపైనా ఇకనుంచి పరిశీలిన
- అసెంబ్లీలో చర్చించి సమగ్ర చట్టం రూపకల్పన
- ఉన్నతస్థాయి సమీక్షలో సిఎం రేవంత్ ఆదేశం

హైదరాబాద్,జూలై18 తరంగాలు : ఆహార, ఔషధాల కల్తీని నిరోధించేందుకు కఠిన చట్టం రూపొందించాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. కూరగాయలు, పండ్లు, పాలు, ఆహార పదార్థాల కల్తీ వల్ల ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని అన్నారు. ఆహార, ఔషధ కల్తీ నియంత్రణపై మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో ముఖ్యమంత్రి సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఆకుకూరలు, కూరగాయలు, పాలు ఎక్కువ రోజులు నిల్వ ఉంచేందుకు.. పండ్లు త్వరగా మగ్గేందుకు విచ్చలవిడిగా రసాయనాలు వాడుతుండటంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఎరువులు, పురుగు మందులు ఎక్కువగా వాడటంతో పంట ఉత్పత్తుల్లోనూ రసాయన అవశేషాలు బయటపడి దిగుమతి చేసుకోవడానికి విదేశాలు నిరాకరిస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు. మార్కెట్‌లో సేంద్రియ ఉత్పత్తుల పేరుతో భారీ ధరలకు అమ్ముతున్నారని, అవి సేంద్రియ ఉత్పత్తులేనని నిర్ధరించేందుకు సరైన వ్యవస్థలు లేవన్నారు. ఈ నేపథ్యంలో కల్తీల నిరోధానికి సమగ్ర చట్టాలు ఉన్న దేశాలకు వెళ్లి అక్కడి విధానాలను అధ్యయనం చేసి సమగ్ర నివేదిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. బిల్లు రూపొందించి శాసనసభలో సమగ్రంగా చర్చించడంతో పాటు.. ప్రజల అభిప్రాయాలు స్వీకరించనున్నట్లు తెలిపారు. కల్తీలకు సంబంధించి సమాచార సేకరణకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని చెప్పారు. కల్తీల నిరోధానికి సంబంధించి ముందుగా క్యూర్ ప్రాంతాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకోవాలని

మిగతా 2వ పేజిలో..




# ప్రజాకవికి అపూర్వ గౌరవం ఇచ్చాము

- అందెశ్రీ కుటుంబానికి వాగ్దానాలన్నీ నెరవేర్చాం
- 'అందెశ్రీ స్మృతి వనం' శంకుస్థాపనలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్,జూలై18 తరంగాలు : ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సాంస్కృతిక సారథి, ప్రజాకవి డాక్టర్ అందెశ్రీకి తమ ప్రభుత్వం అపూర్వ గౌరవం ఇచ్చిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మేడ్చల్ జిల్లా ఘట్కేసర్‌లో అందెశ్రీ అంతిమ సంస్కారాలు జరిగిన ప్రదేశంలో 'అందెశ్రీ స్మృతి వనం' ఏర్పాటుకు, అలాగే ఆయన విగ్రహ ప్రతిష్ఠాపనకు జయంతి రోజైన శుక్రవారం నాడు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డితో కలిసి ఉప ముఖ్యమంత్రి భూమి పూజ చేసి, పునాది రాయి వేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ... సాధారణంగా నాయకులు లేదా ప్రభుత్వాలు ఒక కార్యక్రమం చేసి ఆ తర్వాత వదిలేస్తుంటాయని, కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అలా కాదని, ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకుంటుందని చాటిచెప్పారు. అందెశ్రీ దివంగతులైన వేళ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఆయన పాడె మోసి ఒక కవికి ఇవ్వాల్సిన అపూర్వమైన నివాళిని అర్పించి, తమకున్న గౌరవాన్ని చాటారని గుర్తు చేశారు. ఒక నిరుపేద దళిత కుటుంబంలో పెరిగి, రాష్ట్రం కోసం తపించిన ప్రజా గాయకుడికి ఈ ప్రభుత్వం

మిగతా 2వ పేజిలో..

# స్థానిక ఉత్పత్తులను ప్రజలు ఆదరించాలి

- 16 నుండి 26 వరకు 'బోనాలు- చేతివృత్తుల మేళా'
- ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రదర్శనలు
- మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్,జూలై 18 తరంగాలు : చేతి వృత్తి కళాకారులకు చేయూత నివ్వాలని రాష్ట్ర ప్రభుత్వ బిసి సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 'బోనాలు- చేతివృత్తుల మేళా, బిసి చేతివృత్తుల అమ్మకాలు- ప్రదర్శన'ను ఈనెల 16వ తేదీ నుండి 26 వరకు ట్యాంక్ బండ్, అంబేద్కర్ విగ్రహము ప్రక్కన గల గ్రౌండ్స్ లో నిర్వహిస్తోంది.చేతివృత్తుల కళాకారులచే తయారు చేసిన వివిధ వస్తువుల ప్రదర్శన, విక్రయము విజయవంతంగా కొనసాగుతున్నది. ఈ ప్రదర్శనలో కుమ్మరులు వారు తయారు చేసిన మట్టిపాత్రలు, గౌడన్నల 'నీరా' స్టాల్, మేదరివారు తయారు చేసిన వెదురు వస్తువులు,హ్యాండ్ లూమ్స్ పోచంపల్లి-ఇక్కత్, గద్వాల్ - నారాయణపేట్, పూసలవారి సామగ్రి, మహిళా స్వయం సహాయక సంఘాల స్వగృహ ఫుడ్స్, ఇతర బిసి వర్గాలచే తయారు చేయబడిన వస్తువులు, తెలంగాణ వంటకాలు, మత్స్య కారుల తయారు చేయబడే చేప

మిగతా 2వ పేజిలో..



# పర్యావరణవేత్త వాంగ్‌చుక్ ఆస్పత్రికి తరలింపు

- హైకోర్టు ఆదేశాలతో పోలీసుల నిర్ణయం
- సఫ్దర్ జంగ్ ఆస్పత్రికి తరలించి చికిత్స

న్యూఢిల్లీ,జూలై18తరంగాలు : దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద 21 రోజులుగా నిరాహారదీక్ష చేస్తోన్న పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌ను శపోలీసులు బలవంతంగా శనివారం ఆసుపత్రికి తరలించారు. ఆయనకు తగిన

మిగతా 2వ పేజిలో..

# లక్షల ఉద్యోగాల హామీ ఏమయ్యింది

- జాబ్ క్యాలెండర్, రెండు లక్షల ఉద్యోగాలు ఏవీ
- కొలువుల కుంభమేళా కాదు.. కుంభకోణాల కుంభమేళా
- ఢిల్లీలో రాహుల్ గాంధీ జేబులు నిండుతున్నాయి
- తెలంగాణలో లూటీ జరుగుతోంది
- మొహబ్బత్‌కి దుకాణ్ కాదు.. ధోకేకా మకాన్ నడుస్తోంది
- చాయ్ పే చర్చాను మరచిన రాహుల్
- బీఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సులో కేటీఆర్ ఘాటు విమర్శలు

2వ పేజిలో..



# భారత అంతరిక్ష రంగంలో సరికొత్త అధ్యాయం



- స్కైరూట్ ఏరోస్పేస్ 'విక్రమ్-1' రాకెట్ ప్రయోగం విజయవంతం
- తొలుత ఇంధన ప్రక్రియలో సాంకేతిక లోపం
- అరగంటలోపే సరిదిద్ది పూర్తి చేసిన షార్
- ప్రైవేట్ రంగంలో తొలి రాకెట్ కావడంతో సర్వత్రా హర్షం
- ప్రయోగాన్ని వీక్షించిన లోకేశ్, ఇస్రో మాజీ శాస్త్రవేత్తలు

శ్రీహరికోట,జులై18తరంగాలు :భారత అంతరిక్ష రంగంలో సరికొత్త అధ్యాయం ప్రారంభమైంది. శ్రీహరికోట షార్ అంతరిక్ష కేంద్రం నుంచి చేపట్టిన ప్రయోగం విజయవంతం అయ్యింది. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ప్రైవేట్ స్పేస్‌టెక్ స్టార్టప్ 'స్కైరూట్ ఏరోస్పే 'విక్రమ్-1' రాకెట్ రూపొందించింది. శ్రీహరికోటలోని సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం(షార్) నుంచి శనివారం మధ్యాహ్నం 12:05 గంటలకు చేపట్టిన ఈ ప్రయోగం విజయవంతమైంది. దీంతో ప్రభుత్వ ఆధ్వర్యంలోని అంతరిక్ష కార్యక్రమాలు సహా భారత ప్రైవేటు రంగం కూడా ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపగల సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటినట్లు అయ్యింది. వాస్తవానికి ఉదయం 11.30 గంటలకు ప్రయోగం జరగాల్సి ఉండగా సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో ప్రయోగానికి స్వల్ప అంతరాయం ఏర్పడింది. ఆ తర్వాత శాస్త్రవేత్తలు పరిశీలనలు చేపట్టి ఇంధన పక్రియలో తలెత్తిన సమస్యను గుర్తించి సరిచేశారు. 35 నిమిషాల తర్వాత తిరిగి రాకెట్‌ను ప్రయోగించారు. ఈ రాకెట్.. సాంకేతిక పేలోడ్‌లు సహా ప్రధాని నరేంద్ర మోదీ స్వహస్తాలతో 'వందేమాతరం' అని రాసి పంపిన ప్రత్యేక పోస్ట్‌కార్డును అంతరిక్షంలోకి

మిగతా 2వ పేజిలో..



# బాణసంచా కర్మాగారంలో భారీ పేలుడు

- 8మంది దుర్మరణం..15మందికి తీవ్ర గాయాలు

అహ్మదాబాద్,జూలై18 తరంగాలు : అహ్మదాబాద్‌లోని ఓ బాణసంచా కర్మాగారంలో భారీ పేలుడు సంభవించింది. రామోల్-గత్రాడ్ రోడ్డులోని కర్మాగారంలో ప్రమాదం జరిగి 8 మంది మృతిచెందగా.. మరో 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. బాధితుల్లో నలుగురిని ఎల్జీ ఆస్పత్రికి తరలించిన సహాయక సిబ్బంది.. మరో ముగ్గురిని అసర్వా సివిల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వస్త్రాల్‌లోని రాపిడ్ యాక్షన్ ఫోర్స్ శిబిరం వెనుకే ఆ ఫ్యాక్టరీ ఉంది. పేలుడు శబ్దం విన్న వెంటనే శిబిరంలోని సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక బృందాలు రాకముందే సహాయక చర్యలు

మిగతా 2వ పేజిలో..

జాతీయ దిన పత్రిక
తరంగాలు
THARANGALU DAILY NEWS
ఆదివారం, 19 జూలై, 2026


## ఆహార కల్తీపై ఇక ఉక్కుపాదం

సూచించారు. పైలట్ ప్రాజెక్టులో వచ్చే లోటుపాట్ల ఆధారంగా ముందుకు సాగాలని సీఎం దిశానిర్దేశర చేశారు. ఈ క్రమంలో తెలంగాణలో ఆహార, ఔషధ కల్తీలను పూర్తిగా అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కఠిన చట్టాన్ని తీసుకురావాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో కల్తీల నియంత్రణపై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కల్తీ ఆహారం, నకిలీ ఔషధాల వల్ల ప్రజల ఆరోగ్యం తీవ్ర ప్రమాదంలో పడుతోందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కల్తీకి సంబంధించిన సమాచారాన్ని ప్రజలు నేరుగా ప్రభుత్వానికి చేరవేసేలా ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే అక్రమాలను వెలుగులోకి తీసుకొచ్చే విజిల్ బ్లోయర్ల వ్యవస్థను కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. తెలంగాణ ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ అథారిటీ చట్టంపై అసెంబ్లీలో సమగ్ర చర్చ నిర్వహించి, ప్రజల అభిప్రాయాలను సేకరించిన అనంతరం బిల్లుకు తుది రూపం ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారు. కల్తీల నియంత్రణలో ప్రపంచంలోని వివిధ దేశాల్లో అమలవుతున్న చట్టాలు, విధానాలను అధ్యయనం చేసి వాటిలో ఉత్తమ పద్ధతులను తెలంగాణలో అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. తొలి దశలో 'క్యూర్' ప్రాంతంలో పైలట్ ప్రాజెక్టుగా ఈ వ్యవస్థను అమలు చేసి, అనంతరం రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్నట్లు తెలిపింది. సేంద్రియ ఉత్పత్తుల ధృవీకరణకు ప్రత్యేక వ్యవస్థను రూపొందించడంపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. రసాయన అవశేషాలు, కల్తీ కారణంగా వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులపై ప్రతికూల ప్రభావం పడుతోందని సీఎం పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, కల్తీలకు పాల్పడే వారిపై ఇకపై ఎలాంటి రాజీ లేకుండా
కఠిన చర్యలు తీసుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ సమీక్షలో డిజిపి ఆనంద్, సిఎస్ సంజయ్ జాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాకవికి అపూర్వ గౌరవం ఇచ్చాము

సముచిత మర్యాదను అందించిందన్నారు. ఆనాడు అందెశ్రీ అంత్యక్రియల సమయంలో ఆయన కుటుంబానికి ప్రభుత్వం ఏ ఐదు వాగ్దానాలనైతే ఇచ్చిందో, వాటిని మరచిపోకుండా, నేడు స్మృతివనానికి భూమి పూజ చేసే సమయానికే వాటన్నింటినీ నెరవేర్చిన ప్రజా ప్రభుత్వంగా నిలిచామన్నారు. అందెశ్రీ కుటుంబాన్ని ఆదుకునేందుకు ఇచ్చిన మాట ప్రకారం ఆయన కుమారుడు దత్తుకు బి.జె.ఆర్. డిగ్రీ కళాశాలలో ఉపన్యాసకుడిగా (లెక్చరర్) ప్రభుత్వ ఉద్యోగాన్ని కల్పించామని తెలిపారు. అలాగే అందెశ్రీ రచించిన ప్రసిద్ధ కవితా సంకలనం 'నిప్పుల వాగు' 20 వేల కాపీలను ప్రభుత్వ పరంగా ముద్రించి పంపిణీ చేసేందుకు విద్యాశాఖకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి, ఆ పనులను పురోగతిలో పెట్టామన్నారు. ఆయన అంతిమ సంస్కారాలు జరిగిన ప్రదేశాన్ని స్మృతి వనంగా మారుస్తామని చెప్పిన విధంగానే నేడు ముఖ్యమంత్రి తో కలిసి భూమి పూజ నిర్వహించడంతో పాటు, అందెశ్రీకి పద్మశ్రీ అవార్డు ఇవ్వాల్సిందిగా కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున అధికారికంగా సిఫార్సు కూడా చేయడం జరిగిందని వివరించారు. నాడు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం కోసం ప్రతి ఒక్కరినీ కదిలించిన అందెశ్రీ కలం నుంచి జాలువారిన 'జయ జయహే తెలంగాణ' పాటను అధికారిక రాష్ట్ర గీతంగా ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా ఏ కార్యక్రమం జరిగినా ఈ పాటను వినేలా మరియు వినిపించేలా ప్రభుత్వం నిర్ణయించి అమలు చేస్తున్నదని వివరించారు. 'మాయమై పోతున్నాడమ్మా మనిషన్నవాడు అనే పాట ద్వారా మానవత్వం గురించి, సమాజం పట్ల మనిషి, నాయకులు ఏ రకంగా నడుచుకోవాలో యావత్ ప్రపంచానికి తెలియజేసిన మహనీయుడు అందెశ్రీ. ఆయన జీవితాన్ని, ఆలోచనలను, సాహిత్య సంపదను ఆదర్శంగా తీసుకుని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పిలుపునిచ్చారు.

## భాజపా నేతల్లో ఎలాంటి విభేదాలు లేవు

హైదరాబాద్,జూలై18 తెలంగాణ భాజపా నేతల్లో ఎలాంటి విభేదాలు లేవని, అందరం కలసి అధికారం కోసం కృషి చేస్తున్నామని బిజెపి ఎంపి లక్ష్మణ్ అన్నారు. బండి సంజయ్, ఈటెల రాజేందర్ మధ్య ఉన్న విభేదాలపై ఆయన స్పందించారు. కీలక నేతల మధ్య విభేదాలపై అధిష్ఠానం దృష్టి సారించింది. కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ తో ఆ పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ అభయ్ పాటిల్ భేటీ అయ్యారు. ఎంపీ లక్ష్మణ్ నివాసంలో ఇరువురు నేతలతో గంట పాటు సమావేశం జరిగింది. పార్టీ బలోపేతంపై దృష్టి సారించాలని అభయ్ పాటిల్ వారికి సూచించారు. కరీంనగర్ నియోజకవర్గానికి సంబంధించిన అంశాల్లో ఇద్దరూ కలిసి పని చేయాలని, ఏమైనా సమస్యలు ఉంటే.. అంతర్గతంగా పరిష్కరించుకోవాలని ఆదేశించారు. అనంతరం ఇరువురు నేతలతో కలిసి ఎంపీ లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో భాజపాను అధికారంలోకి తీసుకురావడంపై చర్చించినట్లు తెలిపారు. ప్రజలకు కాంగ్రెస్‌పై కోపం ఉందని, అలాగే బీఆర్‌ఎస్‌పై నమ్మకం లేదని తెలిపారు. వచ్చే ఎన్నికల నాటికి అసెంబ్లీ, లోక్‌సభ సీట్లు పెరుగుతాయని, జమిలి ఎన్నికలు జరుగుతాయన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. భాజపాను అధికారంలోకి తెచ్చేందుకు తామంతా కలిసి పనిచేస్తామని వివరించారు. తెలంగాణలో అధికారంలోకి రావాలనే పట్టుదలతో ఉన్న బీజేపీ.. ఆ దిశగా అడుగులు వేస్తోందన్నారు. ఈ క్రమంలోనే నేతల మధ్య విభేదాలను తొలగించి.. అందరినీ ఒక తాటిపైకి తీసుకురావాలని ప్లాన్ చేస్తోంది. ఎంతో కాలంగా విభేదాలతో ఎడమొహం పెడమొహంగా ఉంటున్న కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ మధ్య సయోధ్య కుదిర్చారు. వీరిద్దరి మధ్య రాజీ కుదిర్చేందకు రంగంలోకి దిగిన బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి అభయ్ పాటిల్.. నేడు ఈటల రాజేందర్, బండి సంజయ్‌తో సమావేశం నిర్వహించారు. ఎంపీ లక్ష్మణ్ నివాసం వేదికగా జరిగిన ఈ సమావేశంలో ఈటల, బండి మధ్య రాజీ కుదిర్చారు. విభేదాలు పక్కనపెట్టి.. తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకువచ్చే దిశగా కృషి చేయాలని ఇద్దరు నేతలకు అభయ్ పాటిల్ దిశానిర్దేశం చేశారు. భేటీ అనంతరం మీడియా ముందుకు బీజేపీ నేతలు.. తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవన్నారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చేది బీజేపీనే అని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ లక్ష్మణ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ తీరుతో ప్రజలు విసిగిపోయారన్నారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చలేదని, కాంట్రాక్టర్లు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఏర్పడిందంటూ ఎంపీ లక్ష్మణ్ మండిపడ్డారు. తెలంగాణ అభివృద్ధిపై మోదీ ప్రత్యేక చొరవ చూపారని, వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీదే అధికారమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## స్థానిక ఉత్పత్తులను ప్రజలు ఆదరించాలి

వంటకాలు, ఇతర భోజన స్టాల్స్ సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ ప్రదర్శనలో లభించే వస్తువులు వినియోగదారులకు, సందర్శకులకు సరసమైన ధరలలో లభ్యమవుతున్నాయి. ఈ ప్రదర్శన ప్రతిరోజు ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 10:00 గంటల వరకు కొనసాగుతున్నది. ప్రభుత్వం సందర్శకులకు ప్రవేశము ఉచితంగా కల్పిస్తున్నది. ప్రదర్శనలో వివిధ రంగాలకు చెందిన 60 స్టాల్స్ ఏర్పాటు చేశారు. ప్రజల నుంచి వస్తున్న విశేష ఆదరణతో స్టాల్స్ నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చేనేత, హస్తకళలు, మట్టి కళలు, చెక్క బొమ్మలు వంటి సంప్రదాయ కళలను ప్రోత్సహించడ మే ఈ మేళా ప్రధాన లక్ష్యమని, గ్రామీణ కళాకారుల ప్రతిభకు మార్కెట్ కల్పిస్తూ వారి జీవనోపాధిని బలోపేతం చేయడంలో ఇటువంటి మేళాలు కీలక పాత్ర పోషిస్తాయని రాష్ట్ర బిసి సంక్షేమశాఖ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. 'వోకల్ ఫర్ లోకల్' భావనకు అనుగుణంగా స్థానిక ఉత్పత్తులను ప్రజలు ఆదరించాలని, సాంప్రదాయ కళలను నేటి తరానికి పరిచయం చేసి, భావితరాలకు అందించడం మన అందరి బాధ్యత అని ఆయన తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కళాకారుల సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి, మార్కెటింగ్ అవకాశాల విస్తరణకు కట్టుబడి ఉందన్నారు. మేళాలో పాల్గొన్న ప్రతి కళాకారుడికి అభినందనలు తెలియజేస్తూ, ప్రజలు పెద్ద ఎత్తున సందర్శించి హస్తకళ ఉత్పత్తులను కొనుగోలు చేసి కళాకారులను ప్రోత్సహించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. మన కళలు, మన చేతివృత్తులు? మన సంపద అనే భావనతో ప్రతి ఒక్కరూ ఈ మేళాను విజయవంతం చేయాలన్నారు. బోనాల పండుగకు అవసరమైన బోనం కుండలతో పాటు సంప్రదాయ ఆచారాలకు ఉపయోగించే వివిధ రకాల వస్తువులను ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉంచారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానంలో అంతర్భాగమైన అనేక కులవృత్తులు కనుమరుగు అవ్వకుండా మరింతగా ప్రోత్సహించెందుకు ప్రభుత్వం ప్రదర్శనను ఏర్పాటు చేసింది.

## బాణసంచా కర్మాగారంలో భారీ పేలుడు

ప్రారంభించారు. బాధితులను ఆస్పత్రులకు తరలించడంతో పాటు శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించారు. అనంతరం ఘటనాస్థలికి ఐదు అగ్నిమాపక వాహనాలతో ౖ÷ర్ సిబ్బంది చేరుకున్నారు. తీవ్రంగా శ్రమించి ఎట్టకేలకు మంటలను అదుపు చేశారు. ఘటనపై దర్యాప్తు ప్రారంభించిన అధికారులు బాణసంచా కర్మాగారానికి ఎలాంటి అనుమతులు లేవని నిర్ధారించారు. ఈ పేలుడుతో భారీ ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లిందని వారు వెల్లడించారు. కాగా, పేలుడు ఘటనతో తీవ్ర దిగ్భ్రాం÷-రతికి గురైనట్లు స్థానికులు తెలిపారు. ఒక్కసారిగా భారీ పేలుడు సంభవించడంతో స్థానికంగా భయాందోళనలు రేకెత్తినట్లు పేర్కొన్నారు. పేలుడు ధాటికి శబ్దం దాదాపు ఐదు కిలోమీటర్ల దూరం వరకు వినిపించిందని వారు వెల్లడించారు. బాణసంచా కర్మాగారంలో పేలుడు ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాం÷-రతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలియజేశారు. ప్రమాదంలో మృతిచెందిన వారికి రూ.2లక్షలు, క్షతగాత్రులకు రూ.50వేల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.

## పర్యావరణవేత్త వాంగ్‌చుక్ ఆస్పత్రికి తరలింపు

వైద్యసహాయం అందించాలంటూ దిల్లీ హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో నిరసన ప్రాంతం నుంచి పోలీసులు బలవంతంగా తీసుకెళ్లారు. ప్రవేశ పరీక్షల నిర్వహణలో లోపాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో గత నెలాఖరులో దీక్ష ప్రారంభించగా.. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం క్షీణించింది. ఆయన్ను సప్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యపరిస్థితి నిలకడగా ఉందని సమాచారం. కోర్టు ఆదేశాల ప్రకారం వాంగ్‌చుక్‌ను తరలిస్తోన్న సమయంలో నిరసనకారులు అడ్డుకోవడంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉంది. జంతర్‌మంతర్ వద్ద నిరసనకారులు శాంతియుతంగా వ్యవహరించా లని, వీలైనంత త్వరగా ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయాలని కోరుతున్నామని దిల్లీ పోలీసులు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. తన అనుమతి లేకుండా తన భర్తకు ఎలాంటి చికిత్సా అందించొద్దని వాంగ్‌చుక్ భార్య గీతాంజలి జె ఆంగ్మో డిమాండ్ చేశారు. ఆయన సప్దర్‌జంగ్ ఆసుపత్రిలో ఉన్నారు. నా అనుమతిలేకుండా చికిత్స ప్రారంభించవద్దు. ఆయనకు ఏదైనా జరిగితే ప్రతిఒక్కరిని బాధ్యుల్ని చేస్తాను. ఆయన నిన్న బాగానే కనిపించారు. ఆసుపత్రికి తీసుకురావాల్సిన అవసరం లేదు. మా వైద్యుడి అనుమతి లేకుండా ఏ చికిత్సా అందించడానికి వీలు లేదు. అది మా హక్కు అని మీడియాతో మాట్లాడారు.

## లక్షల ఉద్యోగాల హామీ ఏమయ్యింది

హైదరాబాద్,జూలై18 ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలిస్తానని రాహుల్ గాంధీ ఇచ్చిన మాట తప్పారని కేటీఆర్ తెలిపారు. రాహుల్ గాంధీకి తెలుగు రాదు.. మన బాధ తెల్వదు అని అన్నారు. అశోక్‌నగర్‌లో చాయ్‌పే చర్చా పెట్టింది అసలు రాహుల్‌గాంధీకి గుర్తుందా అని ప్రశ్నించారు. యువత తలరాత మారుస్తానని అబద్ధపు హామీలు ఇచ్చారని.. జాబ్ క్యాలెండర్, రెండు లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయని నిలదీశారు. డిగ్రీ విద్యార్థినులకు స్కూటీలు ఏమయ్యాయి? విద్యా భరోసా ఏమైందని అడిగారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ జేబులు నిండుతున్నాయని.. తెలంగాణలో లూటీ జరుగుతోందని కేటీఆర్ విమర్శించారు. తెలంగాణలో మొహబ్బత్‌కి దుకాణ్ కాదు.. ధోకేకా మకాన్ నడుస్తోందని ఆరోపించారు. కొలువుల కుంభమేళా అని చెప్పి.. కుంభకోణాల కుంభమేళా చేస్తున్నారని మండిడ్డారు. హైదరాబాద్ సరూర్‌నగర్‌లో బీఆర్‌ఎస్ తలపెట్టిన యువ సంగ్రామ సదస్సులో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఉద్యోగాలు అడిగితే ఉరికించి కొడుతున్నారని కాంగ్రెస్ సర్కార్‌పై కేటీఆర్ మండిపడ్డారు. డిసెంబర్ 9 నుంచి ఉద్యోగ పర్వం కాదు.. ఉన్మాదపర్వం చూపిస్తున్నారని అన్నారు. నిరుద్యోగుల పట్ల దౌర్జన్య కాండ కొనసాగుతోందని తెలిపారు. రాహుల్ గాంధీకి నిరుద్యోగుల ఆక్రోశం కనబడటం లేదా అని నిలదీశారు. నిరుద్యోగ అభ్యర్థుల శోకాలు వినిపించడం లేదా అని ప్రశ్నించారు. సిటీ సెంట్రల్ లైబ్రరీలో దాడులు, ఓయూలో నిర్బంధాలు కనిపించడం లేదా అని అడిగారు. ఢిల్లీలో రాజ్యాంగం చేత పట్టుకుని రాహుల్ గాంధీ సుద్దపూస మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. హైదరాబాద్ నడిబొడ్డున ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుంటే పట్టించుకునే వారే లేరని కేటీఆర్ మండిపడ్డారు. రాహుల్ గాంధీ ప్రధాని అయ్యే వరకు వదిలిపెట్టనని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నాడని తెలిపారు. నవంబర్ 22న అవినీతి సొమ్ముతో జాబ్ క్యాలెండర్‌పై యాడ్‌లు వేశారని గుర్తుచేశారు. కానీ ఇవాళ జాబులు లేవు.. జవాబులు లేవని విమర్శించారు. ఉద్యోగాలు లేవు.. క్యాలెండర్ మారినా.. జాబ్ క్యాలెండర్‌కు దిక్కు లేదని అన్నారు. అసెంబ్లీలో ప్రకటించిన జాబ్ క్యాలెండర్ చిత్తు కాగితాలుగా మారిందని విమర్శించారు. చరిత్రను మరిచిపోతే భవిష్యత్ తరాలు క్షమించవని హెచ్చరించారు. చరిత్రలు, ఇతిహాసాలు, పురాణాలు చదవాలని సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ సూచించారు. తెలంగాణ ఉద్యమాల్లో చావగొట్టిన వాళ్లే మళ్లీ అధికారంలోకి వస్తారని తెలిపారు. కాంగ్రెస్ అలవిగాని హామీలు నమ్మి తెలంగాణ యువత మోసపోయింద్రు అని తెలిపారు. 1952, 1969లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ యువత గుండెల్లో గుణపాలు నింపిందని గుర్తుచేశారు.

వేలమంది యువత ప్రాణాలు తీసుకున్నా కాంగ్రెస్‌కు రక్తదాహం తీరడం లేదని అన్నారు. మన రక్తం పొలాల మీద చల్లాలని చిల్లరమాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రైతు, యూత్, మహిళ, ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌పై కాంగ్రెస్ అనేక హామీలు ఇచ్చిందని తెలిపారు. ఓటు కోసం కోటి మోసాలు చేస్తున్న కాంగ్రెస్ తీరు దేశానికి తెలియాలన్నారు. రేపటి తెలంగాణ నిర్మాతలు మీరు.. భవిష్యత్ నిర్ణేతలు మీరే అని యువతను ఉద్దేశించి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అలాంటి యువతను కాంగ్రెస్ సర్కార్ మోసం చేస్తున్నదని మండిపడ్డారు. మీకు జరిగిన మోసం, వంచనను గుర్తుచేసుకుని కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సరిగ్గా 38 నెలల కింద ఇదే సరూర్ నగర్ స్టేడియం సాక్షిగా తెలంగాణ యువత దగా పడిందని తెలిపారు. నిరుద్యోగులను వంచించిన దగాకోరులు కాంగ్రెస్ నాయకులు అని పేర్కొన్నారు. హైకమాండ్ తరలివచ్చి మాయామశ్చీంద్ర కార్యక్రమం ఇక్కడ చేశారని ఎద్దేవా చేశారు. యూత్ డిక్లరేషన్ పేరిట దుర్మార్గమైన వాగ్దానాల వరద పాటించారని మండిపడ్డారు. పాత కేటుగాళ్లు.. కొత్త డూప్లికేట్లు వచ్చి యువతపై లేని ప్రేమను కనబరిచారని తెలిపారు. యూత్‌కు ఇచ్చిన ఒక్క హామీ అయినా నెరవేర్చారా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాలు ఇచ్చారా అని నిలదీశారు. ప్రైవేటు కంపెనీల్లో 75 శాతం రిజర్వేషన్ వచ్చిందా అని అడిగారు. కాలేజీ విద్యార్థినులకు స్కూటీలు వచ్చాయా? యువతకు రూ.10లక్షల రుణాలు వచ్చాయా? ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వచ్చాయా? అని ప్రశ్నించారు. నాలుగు ట్రిపుల్‌ఐటీలు, మూడు యూనివర్సిటీలు వచ్చాయా? నెలకు రూ.4వేల భృతి వచ్చిందా? పదో తరగతిలో రూ.10వేలు, ఇంటర్ పాసైతే రూ.15వేలు వచ్చాయా? డిగ్రీ ఉత్తీర్ణులతై లక్ష వచ్చాయా? పీహెచ్‌డీ పాసైతే రూ.5లక్షలు వచ్చాయా? అని ప్రశ్నించారు. ఇంత మోసానికి పాల్పడిన వారిని ఏమనాలో ఆలోచించాలని సూచించారు. దగుల్బాజీలా.. దోకేబాజ్‌లు అనాలో మీరే ఆలోచించాలన్నారు. జిత్తులమారి ముసలి నక్క కాంగ్రెస్ యువజనాన్ని తెలివిగా చిత్తు చేసిందని కేటీఆర్ విమర్శించారు. 60 ఏళ్లు నెత్తురు మరిగిన కాంగ్రెస్ యువతను ఎలా మోసం చేసిందో గుర్తించాలన్నారు. కాంగ్రెస్ మోసపు వలలో పడిపోయి గోసపడుతున్నారని తెలిపారు. 31 నెలలు గడిచాయి.. నిరుద్యోగులకు కాంగ్రెస్ ఏం చేసిందని ప్రశ్నించారు. మాటతప్పి వంచించి, నమ్మించి నట్టేట ముంచి అధికారంలోకి వచ్చిందని కాంగ్రెస్‌పై మండిపడ్డారు. యువతరంతో పెట్టుకుంటే కొన్ని తరాలు పుట్టగతులు ఉండవని హెచ్చరించారు.

## భారత అంతరిక్ష రంగంలో సరికొత్త అధ్యాయం

తీసుకెళ్లింది. వీటితో పాటు కాస్మోస్ డైమండ్స్ సంస్థ రూపొందించిన 'కాస్మిక్ బ్లూమ్' ఆర్ట్‌వర్క్, విక్రమ్-1 రాకెట్ సూక్ష్మ ప్రతిరూపాన్నీ నింగిలోకి పంపారు. దీనిపై సర్ సీవీ రామన్, విక్రమ్ సారాభాయ్, ఏపీజే అబ్దుల్ కలాం వంటి ప్రముఖుల సూక్ష్మరూపాలను చెక్కారు. అంతేకాకుండా.. ఈ ప్రయోగం విజయవంతం కావాలని కాంక్షిస్తూ స్కైరూట్ టీమ్ సహా ఇస్రో మాజీ ఛైర్మన్లు, శాస్త్రవేత్తలు, భారతీయ వ్యోమగాములు, ఇతరులు పంపిన డజన్ల కొద్దీ చేతిరాత పోస్ట్‌కార్డులనూ ప్రత్యేక పేలోడ్ బాక్స్‌లో భద్రపరిచారు. స్కైరూట్ సంస్థ 'మిషన్ ఆగమన్' పేరిట ఈ ప్రయోగం చేపట్టింది. భారత ప్రైవేట్ అంతరిక్ష రంగం ఆర్బిటాల్ ప్రయోగాల యుగంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఈ మిషన్‌కు ఆ పేరు పెట్టింది. విక్రమ్-1 ద్వారా గ్రహాస్పేస్, కాస్మోసెర్వ్, డీక్యూబ్‌డ్ సంస్థలకు చెందిన టెక్నాలజీ డెమానిస్ట్రేషన్ పేలోడ్‌లు సహా స్కైరూట్‌కు చెందిన 'స్కోప్'ను కూడా అంతరిక్షంలోకి పంపారు. ఈ ప్రయోగం ద్వారా రాకెట్‌లోని ప్రొపల్షన్, స్టేజ్ సెపరేషన్, గైడెన్స్, నావిగేషన్, కంట్రోల్ వ్యవస్థల పనితీరును అంతరిక్ష ప్రయాణంలో పరీక్షించి తద్వారా కీలక సమాచారం రాబట్టనున్నారు. దీంతో రానున్న కాలంలో వాణిజ్య ప్రయోగాల అవసరాలకు సాంకేతిక సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవడమే లక్ష్యంగా స్కైరూట్ ముందడుగేస్తోంది. ఇక.. సుమారు ఏడంతస్తుల భవనం ఎత్తులో రూపొందిన విక్రమ్-1 పూర్తిగా కార్బన్




కాంపోజిట్ నిర్మాణంతో తయారైంది. దేశీయంగా అభివృద్ధి చేసిన 3డీ ప్రింటెడ్ ఇంజిన్లు, ఘన ఇంధన బూస్టర్లతో పనిచేసే ఈ రాకెట్ 350 కిలోల వరకు చిన్న ఉపగ్రహాలను 450 కిలోమీటర్ల ఎత్తులోని లోఎర్త్ ఆర్బిట్ లో ప్రవేశపెట్టే సామర్థ్యాన్ని కలిగి ఉంది. 2022లో విక్రమ్-ఎస్ ద్వారా తొలి ప్రైవేట్ రాకెట్‌ను విజయవంతంగా కక్ష్యలోకి పంపిన స్కైరూట్.. ఇప్పుడు విక్రమ్-1తో తొలి దేశీయ ప్రైవేట్ ఆర్బిటాల్ ప్రయోగం చేపట్టింది. ఈ ప్రయోగాన్ని ఏపీ మంత్రి నారా లోకేశ్ ప్రత్యక్షంగా వీక్షించారు. కుమారుడు దేవాన్ష్‌తో కలిసి శ్రీహరికోటకు వెళ్లిన లోకేశ్.. ఇస్రో గ్యాలరీ నుంచి 'విక్రమ్-1' ప్రయోగాన్ని వీక్షించారు. ఇస్రో మాజీ ఛైర్మన్లు, సీనియర్ శాస్త్రవేత్తలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ నిరాహారదీక్ష

- సంఘీభావం తెలిపిన జిల్లా ఆర్యవైశ్య కార్పొరేషన్ నాయకులు

**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :**



ఏఐసీసీ పిలుపుమేరకు నూతి సత్యనారాయణ గౌడ్ కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో నిరాహారదీక్షకు జిల్లా ఆర్యవైశ్య కార్పొరేషన్ నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా నూతి మాట్లాడుతూ భారతదేశ యువత పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కేంద్ర (బీజేపీ) ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారతదేశ యువత సమస్యల పై వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా యువజన గళం వినిపించేందుకు లోక్ సభ పక్షనేత రాహుల్ గాంధీ అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఛాత్రోన్ కి గూంజ్ కార్యక్రమంలో భాగంగా ఏఐసీసీ ఆదేశానుసారం, టి పి సి సి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ ఏఐసీసీ కార్యదర్శి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఇంచార్జి మీనాక్షి నటరాజన్ పిలుపు మేరకు జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో నిరాహారదీక్ష కార్యక్రమం చేపడుతున్నట్లు అన్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు సారధి తదితరులు పాల్గొన్నారు.




## సమగ్ర శిక్ష శిక్షణలను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలి


- మండల విద్యాధికారి మంగు జయప్రకాశ్



జఫర్గడ్ ప్రతినిధి, జులై 18,(తరంగాలు):

సమగ్ర శిక్షలో భాగంగా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించబోయే ఉపాధ్యాయ శిక్షణా తరగతులు 20 జులై 2026 సోమవారం నుండి ప్రారంభం కానున్నాయని జఫర్ గఢ్ మండల విద్యాధికారి మంగు జయప్రకాశ్ తెలిపారు. మండల వనరుల కేంద్రంలో ఆయన అధ్యక్షతన శిక్షణా తరగతుల రిసోర్స్ పర్సన్స్ సీఆర్పీలు,ఎమ్మార్సి సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ నుండి మండలం లోని సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు రెండు విడుతలుగా మూడు రోజుల చొప్పున శిక్షణా తరగతులు నిర్వహించబడుతాయని వివరించారు. ఈ శిక్షణా తరగతులు మొదటి విడత ఈ నెల 20 నుండి 22 తేదీల్లో మూడు రోజుల పాటు. అదేవిధంగా 23 నుండి 25 తేదీల్లో మూడు రోజుల పాటు రెండో విడత శిక్షణా తరగతులు నిర్వహిస్తామని చెప్పారు. మండలం లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలలో పని చేస్తున్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు 50శాతం చొప్పున రెండు విడుతల్లో నిర్దేశించిన ఉపాధ్యాయులు శిక్షణా తరగతులకు హాజరు కావాలని ఆయన ఆదేశించారు. ఈ శిక్షణా తరగతులలో పాల్గొనే ఉపాధ్యాయులకు సుశిక్షితులైన రిసోర్స్ పర్సన్స్ శిక్షణ ఇస్తారని. ఈ శిక్షణల ద్వారా బోధనా పద్ధతుల్లో మూల్యాంకన పద్ధతుల్లో ఆధునిక నైపుణ్యాల సాధన ఉపాధ్యాయులకు అందుతుందని ఆయన వివరించారు. ఆరు రోజుల పాటు రెండు విడతలలో మూడు రోజుల చొప్పున జరిగే ఈ శిక్షణా తరగతులు మండలం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తిమ్మంపేటలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో శిక్షణ ఆర్పీలు పిట్టల మహేందర్, తౌటం వెంకటేశ్వర్లు, చిదురాల నాగరాజం,దానేకుల రామానుజం,కంప్యూటర్ ఆపరేటర్ బక్కం రాజ్ కుమార్, ఐఈఆర్పీ దుస్సా లక్ష్మణ్, సీఆర్పీలు పుట్టా స్వామి, మారపాక బాబు,రడపాక రమాదేవి, అంబరకొండ సునీత పాల్గొన్నారు.

## రమణమూర్తిపై జరిగిన దాడిని ఖండించిన ప్రజాసంఘాలు



**ఇల్లందు ప్రతినిధి జులై 18, ( తరంగాలు):**

విజయ్ విహారం రమణమూర్తి పై జరిగిన దాడిని ఖండిస్తూ కేశపు రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని తెలియజేస్తూ, శాంతియుత నిరసన కార్యక్రమం ఇల్లందు పట్టణ గోవింద సెంటర్లో చేయడం జరిగింది. రమణమూర్తి పై ఓ చానల్లో రమణమూర్తి ఒక పేపర్లో వచ్చిన కటింగ్ చూపిస్తూ మాట్లాడు తున్న సమయంలో ఒక హిందూ మతోన్మాది ఒక గుండా ఏమి చేయాలని అర్థం కాక వివేక్షణ లేక ఆయన ఏమి చెప్తున్నాడో సరిగ్గా వినకుండా కృష్ణుని తీసి నరేంద్ర మోడీ ని పెట్టి చూపించడం హిందువుల మనోభావాలు దెబ్బతినేలా ఉన్నాయని, ఈ మతోన్మాది రమణమూర్తి పై చెప్పుతో కొట్టడం చాలా దారుణమైన విషయం అన్నారు. అతనిపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని తెలిపారు. ఈ ప్రభుత్వం ఈ పోలీసు వ్యవస్థ ఎవరికోసం పనిచేస్తుందో ఆలోచించాల్సిన అవసరం ఉంది,ఒక దుర్మార్గుడు చేసినటువంటి అరాచకత్వాన్ని ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, మేధావులు ఎందరో కౌంటర్ చేస్తూ ఆ ద్రోహిని అరెస్టు చేయాలని చెప్తున్నప్పటికీ నేటికీ అరెస్టు చేయలేదు అన్నారు. ఇప్పటికైనా స్పందించి అరెస్టు చేయాలని ప్రజాసంఘాలుగా మేము ఈరోజు నిరసన కార్యక్రమం చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జై భారత్ బీసీ పోరాట వేదిక రాష్ట్ర అధ్యక్షు లు వెలిమిచెట్టి వీరన్న, ఎన్. మోహన్ రావు టి. శ్రీనివాస రావు, యం. వసంతరావు, ఆర్.బి. జె రాజు ధనసరి. రామ్మూర్తి, కే.సుధీర్, నాగేశ్వరరావు,వెంకటేశ్వరరావు,కెవిపిఎస్ నరసయ్య, కౌసల్య జి.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

### వర్షాభావ పరిస్థితుల్లో

## రైతులు పంట మార్పిడిపై దృష్టి సారించాలి..

- పంట మార్పిడిపై రైతులకు అవగాహన..
- మండల వ్యవసాయ అధికారి బి.వెంకన్న..

**కేసముద్రం, మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, జూలై.18, తరంగాలు:**

వర్షాభావ పరిస్థితుల్లో రైతులు పంట మార్పిడి పై దృష్టి సారించాలని మండల వ్యవసాయ అధికారి బి.వెంకన్న,అన్నారు. శనివారం కేసముద్రం మండలంలోని నారాయణపురం గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలోగ్రామ సర్పంచ్ ధరావత్ యమున -సుమన్ నాయక్ అధ్యక్షతన వానకాలం 2026- 27 సీజన్లో సాగు చేసే పంటల మీద వాతావరణ శాఖ ఆదేశాల మేరకు పంట మార్పిడిపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి వెంకన్న మాట్లాడుతూ రాష్ట్రంలో ఎల్నినో ప్రభావం వలన





వాతావరణంలో పెను మార్పులు సంబంధించి సకాలంలో వర్షాలు కురిసే అవకాశం లేనందున, సెప్టెంబర్ మాసం చివరివరకు వర్షపాతం తక్కువగా నమోదు అయ్యే అవకాశం ఉన్నందున రైతు సోదరులు నీటి వసతి కింద సాగు చేసే వరిని తగ్గించి, బోర్ల కింద, బావుల కింద, చెరువుల కింద, వరి విస్తీర్ణాన్ని తగ్గించి పంట మార్పిడి విధానాన్ని అవలంబిం చలన్నారు. మెట్ట పంటలు, తక్కువ నీటితో సాగుచేసే పెసర, మినుములు, కందులు జొన్నలు, సజ్జలు, రాగులు, కూరగాయల పంటల సాగులను సాగు చేసి నష్ట నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. వర్షాకాలం సీజన్ లో వేసినటువంటి పత్తి మొక్కజొన్న, పంటలకు అడపాదనప నీటి తడులు ఇచ్చి పంటలను రక్షించుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ గుగులోత్ లచ్చు, ఇరిగేషన్ శాఖ అధికారి విజయ్ , మండల వ్యవసాయ విస్తరణ అధికారి రాజీవ్ లోచన్ ,వార్డు సభ్యులు జాటోత్ వీరన్న, బానోత్ నవీన నరేష్, గ్రామ పెద్దలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## బాలాజీ నగర్ పంచాయతీలో పడకేసిన పారిశుద్ధ్యం

- పారిశుద్ధ్యం పట్ల పట్టింపు ఎక్కడంటున్న ప్రజలు
- బ్లీచింగ్‌తో పాటు, దోమల మందు ఫాగింగ్ చేయని పరిస్థితి వార్డులలో నెలకొంది
- పారిశుద్ధ్యంపై పంచాయతీ కార్యదర్శికి ఫోన్ చేసిన స్పందించిన వైనం

**ఇల్లందు ప్రతినిధి జులై 18, ( తరంగాలు):**

ఇల్లందు మండలం బాలాజీ నగర్ పంచాయతీలో పారిశుధ్యం ఎక్కడ అంటున్న ప్రజలు. డ్రైనేజీలు లేక నీరు నిల్వలతో ఇబ్బంది పడుతున్నామని కనీసం నడిచే పరిస్థితి లేదంటున్న ప్రజలు. వార్డులలో రోడ్లకు ఇరువైపులా చెట్లు విపరీతంగా పేరగడంతో పాములు ఇళ్లలోకి వస్తున్నాయని తెలిపారు. దోమలతో అనేక ఇబ్బందులు





పడుతున్నామని, వర్షాకాల సీజనులో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని ఓవైపు రాష్ట్ర ప్రభుత్వం సూచిస్తుంటే మరోవైపు పంచాయతి అధికారి నిమ్మకు నేరెత్తినట్లుగా ఉంటున్నారని ఆరోపిస్తున్నారు. అసలే వర్షాకాల సీజన్ అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉన్నందున పంచాయతీలో దోమ కాటుతో మలేరియా, డెంగ్యూ,విష జ్వరాలు ప్రజలు కు ప్రబలకుండా తగు చర్యలు చేపట్టేందుకు పంచాయతీలోని అన్ని వార్డులు సందర్శించా ల్సిన కార్యదర్శి ఫోన్ చేసిన స్పందించకపోవడంపై పంచాయతీ ప్రజలు ఆగ్రహిస్తున్నారు. ఇప్పటికైనా మండల అధికారులు స్పందించి బాలాజీ నగర్ పంచాయతీలోని అన్ని వార్డులలో రోడ్లకు ఇరువైపుల ఉన్న చెట్లను తొలగించి, బ్లీచింగ్ చల్లించి, దోమల మందు ఫాగింగ్ చేయించేలా చర్యలు చేపట్టాలని పంచాయతీ ప్రజలు కోరుతున్నారు.

## అఖిల విశ్వ గాయత్రీ పరివార్ శతాబ్ది ఉత్సవాలు



- మాస్టర్ మైండ్స్ హైస్కూల్‌కు "జన్మ శతాబ్ది అవార్డు" ప్రదానం

**ఇల్లందు ప్రతినిధి జులై 18, ( తరంగాలు):**

అఖిల విశ్వ గాయత్రీ పరివార్ కేంద్రం, శాంతికుంజ్ – హరిద్వార్ సంస్థాపకులు వేదమూర్తి పండిత శ్రీరామ శర్మ ఆచార్య సాధన శతాబ్ది, అఖండ దీపజ్యోతి శతాబ్ది సంవత్సరాలు, వందనీయ మాతాజీ జన్మ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించు కొని, గాయత్రీ పరివార్ యగ్ నిర్మాణ్ మిషన్ ఆధ్వర్యంలో ఈరోజు మాస్టర్ మైండ్స్ హైస్కూల్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గాయత్రీ పరివార్ యగ్ నిర్మాణ్ మిషన్ జిల్లా సమన్వయకర్త సంఘసంస్కర్త డా. సతీష్ ఖండేల్వాల్ ముఖ్య అతిథిగా పాల్గొని, సంస్కారవంతమైన విద్యను అందిస్తున్నందుకు మాస్టర్ మైండ్ హైస్కూల్ కరస్పాండెంట్ సర్వేశ్వరరావు కి జన్మ శతాబ్ది అవార్డు" ను అందజేశారు. ఈ సందర్భంగా డా. సతీష్ ఖండేల్వాల్ మాట్లాడుతూ పూజ్య గురుదేవులు, వందనీయ మాతాజీ స్ఫూర్తితో సమాజంలో విలువలతో కూడిన విద్య, సంస్కారాన్ని వ్యాప్తి చేయడంలో మాస్టర్ మైండ్ స్కూల్ చేస్తున్న సేవ అభినంద నీయమనని విద్యార్థులు చదువుతో పాటు సద్బుద్ధి సదాలోచన గాయత్రీ మంత్ర సాధన, దేశభక్తి, నిజాయితీనిఅలవరచుకోవా లని, ఉపాధ్యాయులు సమాజానికి దీపస్తంభాలు అన్నారు. మనం మారితేనే దేశం మారుతుంది అని పిలుపునిచ్చారు. నషా ముక్త భారత్ అభియాన్ లో పాల్గొనాలని మాదకద్రవ్యాలు లేని జిల్లాగా చేద్దామని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్నాక్ట్ క్లబ్ ట్రైనర్ ముత్తైబోయిన శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయనీలు పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, గాయత్రీ పరివార్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## రిలయన్స్ అడాగ్‌లో సీబీఐ సోదాలు

న్యూఢిల్లీ, జూలై 18:

అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ అడాగ్ సంస్థల్లో కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ శనివారం విస్తృత స్థాయిలో సోదాలు నిర్వహించింది. రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఆర్‌సీఎఫ్ఎల్), రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఆర్‌హెచ్ఎఫ్ఎల్)లపై నమోదైన కేసుల విచారణలో భాగంగా ఢిల్లీ, ముంబైలోని 15చోట్ల ఈ తనిఖీలు జరిగాయని సీబీఐ అధికారులు తెలిపారు. మొత్తం ఆర్ అడాగ్‌కు చెందిన 23 అనుబంధ సంస్థల్లో సెర్చ్ ఆపరేషన్ కొనసాగినట్టు ఓ ప్రకటనలో సీబీఐ స్పష్టం చేసింది. బ్యాంకుల నుంచి ఆర్‌సీఎఫ్ఎల్, ఆర్‌హెచ్ఎఫ్ఎల్ సమీకరించిన నిధులను ఈ కంపెనీల ద్వారా పక్కదారి పట్టించారన్న ఆరోపణలున్నాయి.



THARANGALU DAILY NEWS
ఆదివారం, 19 జూలై, 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

## 300 మంది మహిళలతో చిత్తారమ్మ తల్లికి ఆషాడం సారె ఓడిబియ్యం సమర్పణ



**మేడ్చల్ జిల్లా జులై 18 ( తరంగాలు )**

మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం పరిధి లోని శ్రీ చిత్తారమ్మ దేవాలయం లో గాజులరామారం పరిధిలోని స్పెండర్ అపార్ట్మెంట్ లోని మూడు వందల మంది మహిళలు లలితా సహస్రణామపారాయణం చేసే లలిత టీమ్ సభ్యురాలు రాధ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం అత్యంత భక్తి శ్రద్దలతో స్పెండర్ అపార్ట్మెంట్ నుండి ఊరేగింపుగా బాజా భజంత్రిలతో గుర్రపు బండిపై అమ్మవారి ప్రతిమను ఊరేగిస్తూ నాట్యలతో చిత్తారమ్మ దేవాలయానికి చేరుకొని ఆశాడ మాస సారె చీర,సమర్పించి ఓడిబియ్యం పోసి భక్తి శ్రద్దలను చాటుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకురాలు రాధ మాట్లాడుతూ... గత రెండు మూడు సంవత్సరాల నుండి కొద్ది కొద్ది మంది మహిళలతో సారె సమర్పిస్తూ,, అమ్మవారి అనుగ్రహంతో ఈ సంవత్సరం మూడు వందల మంది మహిళా టీంతో సమర్పించే బాగ్యం కలిగిందని, ఇంతటి సహాయసహాకారాలు అందించిన తోటి మహిళలకు దేవాలయసిబ్బందికి ధన్యవాదములు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలు కాలనీవాసులు మహిళా మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు



### యువతి ఆత్మహత్య కేసులో

# ముగ్గురు నిందితుల అరెస్ట్

- **వేధింపుల గుట్టు రట్టు చేసిన కేసముద్రం పోలీసులు!**
- **తనుశ్రీ ఆత్మహత్య కేసు: నిందితులకు రిమాండ్ ఎస్సై క్రాంతికిరణ్...**

**కేసముద్రం, మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, జులై.18, తరంగాలు:**

మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం బోడమంచ్య తండాకు చెందిన బానోతు తనుశ్రీ అలియాస్ బుజ్జమ్మ (19) అనే అమాయక యువతి ఈ నెల 17వ తేదీ మధ్యాహ్నం 12:30 గంటల సమయంలో తన నివాసంలో చున్నీతో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. నూరేళ్ల జీవితాన్ని గడపాల్సిన ఒక నిండు ప్రాణం, తోటి మనుషుల రాక్షసత్వానికి బలైపోవడం స్థానికులను తీవ్రంగా కలిచివేసింది.వేధింపుల గుట్టు రట్టు - కదిలిన పోలీస్ యంత్రాంగం.యువతి మృతిపై కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తూ ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్సై క్రాంతికిరణ్ మానవత్వంతో స్పందించారు. కేసముద్రం పోలీసులు కేవలం కేసు నమోదుకే పరిమితం కాకుండా, బాధితుల ఆవేదనను తమ సొంత కుటుంబ సమస్యగా భావించి దర్యాప్తును ముమ్మరం చేశారు. యువతిని మానసికంగా తీవ్ర క్షోభకు గురిచేసి, ఆమెను ఆత్మహత్యకు ప్రేరేపించిన నిందితులు అదే తండాకు చెందిన జాటోతు సీతారాం, అతని భార్య జాటోతు అమ్మి, వారి కుమార్తె జాటోతు రమ్యలుగా పోలీసులు శాస్త్రీయ ఆధారాలతో నిరూపించారు. తండాలో మెరుపు దాడి నేరస్తులు



తప్పించుకునే అవకాశం ఇవ్వకుండా, ఎస్సై క్రాంతికిరణ్ తన సిబ్బందితో కలిసి బోడమంచ్య తండాలోని నిందితుల నివాసంపై మెరుపు దాడి చేశారు.ముగ్గురు నిందితులను చుట్టుముట్టి, అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని న్యాయస్థానం ముందు హాజరుపరచగా, గౌరవ న్యాయమూర్తి వారికి జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ జైలుకు పంపారు. నేరం చేసిన వారికి శిక్ష తప్పదనే బలమైన సందేశాన్ని ఈ చర్య ద్వారా పోలీసులు సమాజానికి ఇచ్చారు. ప్రజల కోసం పోలీసుల ప్రత్యేక అవగాహన సమాజంలో ఎవరైనా మహిళలను, యువతులను మానసికంగా లేదా శారీరకంగా వేధిస్తే అస్సలు సహించవద్దు. వెంటనే భయం లేకుండా పోలీసులను ఆశ్రయిస్తే నిందితుల తాట తీస్తాం.జీవితంలో ఎదురయ్యే చిన్న చిన్న సమస్యలకు ఆత్మహత్యలు ఏమాత్రం పరిష్కారం కావు. ధైర్యంగా నిలబడి చట్టం ద్వారా నిందితులకు బుద్ధి చెప్పండి. మీ వెనుక పోలీస్ శాఖ రక్షణగా ఉంటుంది. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని, పరుల జీవితాలతో ఆడుకునే వారిపై అత్యంత కఠినమైన సెక్షన్లతో కేసులు నమోదు చేసి జీవితాంతం జైల్లోనే ఉండేలా చూస్తాం. బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం జరిగేలా కోర్టులో కూడా బలమైన సాక్ష్యాలను ప్రవేశపెట్టి నిందితులకు గరిష్ట శిక్ష పడేలా చేస్తామని ఎస్సై భరోసా ఇచ్చారు. చట్టాన్ని కఠినంగా అమలు చేస్తూనే, బాధితుల పక్షాన నిలబడిన కేసముద్రం ఎస్సై మరియు సిబ్బందిని ప్రజలు కొనియాడుతున్నారు.

# అంబరాన్నంటిన "అల్ఫోర్స్ బోనాల ఉత్సవాలు"

- **తెలంగాణ సాంస్కృత సాంస్కృతిక వైభవానికి ప్రతీక**
- **ప్రతి ఊరిలో వాడలో ఘనంగా జరుపుకునే పండుగ బోనాల పండుగ**

**వర్ధన్నపేట ప్రతినిధి, జులై 18,తరంగాలు :**

తెలంగాణ రాష్ట్రం సంస్కృతి, సంప్రదాయాలకు నిలయమని మరియు ఎన్నో పండుగలను చాలా గొప్పగా ఆకాశమే హద్దుగా అన్నట్టుగా నిర్వహించుకుంటామని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అన్నారు. శనివారం వర్ధన్నపేటలోని అల్ఫోర్స్ హై స్కూల్ లో బోనాల పండుగను చాలా అట్టహాసంగా నిర్వహించారు. వేడుకకు ముందు ప్రాంగణంలో ఏర్పాటు





చేసినటువంటి అమ్మవారి చిత్రపటానికి పూలమాలవేసి పూజ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బోనాలను నిర్వహించుకోవడం చాలా పురాతనమైనదని మరియు ఈ పండుగ రోజున అమ్మవారిని కొలుస్తామని వారు తెలిపారు. ఆషాడ మాసంలో అత్యంత వైభవంగా జరుపుకునే సాంప్రదాయ పండుగ బోనాలు పండుగ అని వారు చెప్పారు బోనం అంటే భోజనం అని, అమ్మవారికి ఈ భోజనాన్ని నైవేద్యంగా సమర్పిస్తారని మరియు గ్రామ దేవతలైన మహంకాళి, పోచమ్మ, ఎల్లమ్మ, తల్లులకు భక్తిశ్రద్ధలతో మండిన అన్నాన్ని బెల్లం పాలు కలిపి మట్టే లేదా ఇత్తడి కుండలోని ఏవిధంగా సమర్పిస్తారని వారు చెప్పారు.ఆషాడ మాసంలో మొదటి ఆదివారం లేదా గురువారం గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారికి తొలి బోనం సమర్పిస్తారని వారు తెలుపుతూ ప్రధానంగా మహిళలను తలపై బోనాలను చేతిలో వేపాకులతో, డప్పు వాయిద్యాలు, పోతరాజు విన్యాసాల నడుమ అమ్మవారిని గుడికి తీసుకొని వెళ్తారని చెప్పారు. హైదరాబాద్ నగరంలో కలరావ్యాధి ప్రబలినప్పుడు అమ్మవారిని ప్రార్థించి బోనాలు సమర్పించడంతో ఆ మహమ్మారి తగ్గిందని ప్రజలకు విశ్వాసం.ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో బోనాలు ఉత్సవాలను చాలా వైభవంగా నిర్వహించబడుతాయని మరియు ఆ అమ్మవారి యొక్క ఆశీస్సులు అందరికీ ఉండాలని ప్రత్యేకమైనటువంటి పూజలు నిర్వహించడం జరుగుతుందని వారు గుర్తు చేస్తూ వేడుకల్లో భాగంగా అద్భుతమైన ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు.అదేవిధంగా ప్రాంగణాన్ని వివిధ రకాల వస్తువులు తో అందంగా అలంకరించి పండుగ వాతావరణం మైమరిపించే విధంగా చేశారు. అదేవిధంగా విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



## బయటి ఆహారం ఎక్కువగా తింటున్నారా.. అయితే జాగ్రత్త..



వర్షాకాలంలో జీర్ణాశయ, పేగుల ఇన్‌ఫెక్షన్ల ప్రమాదం గణనీయంగా పెరుగుతుందన్న విషయం అందరికీ తెలిసిందే. ఈ కాలంలో అతిసారం, వాంతులు, కడుపు నొప్పి, ఫుడ్ పాయిజనింగ్ వంటి సమస్యలతో ఆస్పత్రులకు వచ్చే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. వర్షాల కారణంగా తాగునీటి వనరులు కలుషితమవడం, బ్యాక్టీరియా, వైరస్‌లు, పరాన్నజీవులు వేగంగా వ్యాప్తి చెందేందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడటం ఇందుకు ప్రధాన కారణాలుగా ఉంటాయి.వ ర్షాకాలంలో అధిక తేమ, తడి వాతావరణం కారణంగా సూక్ష్మజీవులు వేగంగా వృద్ధి చెందుతాయి. భారీ వర్షాల సమయంలో మురుగునీరు తాగునీటిలో కలిసిపోవడం వల్ల జీర్ణాశయ సంబంధిత ఇన్‌ఫెక్షన్ల ప్రమాదం మరింత పెరుగుతుంది. పిల్లలు, వృద్ధులు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు ఈ ఇన్‌ఫెక్షన్లకు ఎక్కువగా గురవుతారు. వర్షాకాలంలో ఆహారం సులభంగా కలుషితమవుతుంది. సరిగా నిల్వ చేయని ఆహారం, పూర్తిగా ఉడకని పదార్థాలు లేదా అపరిశుభ్ర పరిస్థితుల్లో తయారైన ఆహారంలో బ్యాక్టీరియా వేగంగా పెరుగుతుంది.

### తెలియని చోట్ల నీళ్లను తాగొద్దు..

వర్షాకాలంలో తాగునీటి విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. ఫిల్టర్ చేసిన, మరిగించిన లేదా శుద్ధి చేసిన నీటినే తాగాలి. వరదలు లేదా నీరు నిలిచిపోయిన ప్రాంతాల్లో తెలియని వనరుల నుంచి నీరు తాగకూడదు. చేతుల పరిశుభ్రత కూడా అత్యంత కీలకం. భోజనం చేసే ముందు, మరుగుదొడ్డి ఉపయోగించిన తర్వాత, బయట నుంచి ఇంటికి వచ్చిన వెంటనే సబ్బుతో చేతులను శుభ్రంగా కడుక్కోవడం ద్వారా అనేక ఇన్‌ఫెక్షన్లను నివారించవచ్చు. వర్షాకాలంలో స్ట్రీట్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి. బయట బహిరంగంగా ఉంచిన, ముందే కోసిన లేదా మూత లేకుండా విక్రయించే ఆహారాన్ని తినకూడదు. వీలైనంత వరకు తాజాగా వండిన వేడి ఆహారాన్నే తీసుకోవడం సురక్షితం.

### బయటి ఆహారంతో ముప్పు..

రోడ్ల పక్కన అపరిశుభ్రంగా విక్రయించే ఆహారం, ముందే కోసి బహిరంగంగా ఉంచిన పండ్లు, శుభ్రంగా కడగని పచ్చి కూరగాయలు, సరైన ఉష్ణోగ్రతలో నిల్వ చేయని పాల ఉత్పత్తులు ఈ కాలంలో కలుషితమయ్యే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. వర్షాల సమయంలో నిల్వ నీరు, పారిశుద్ధ్య లోపాలు, రద్దీ ప్రాంతాల్లో అపరిశుభ్ర వాతావరణం కూడా ఇన్‌ఫెక్షన్ల వ్యాప్తికి దోహదం చేస్తాయి. ముఖ్యంగా వర్షపు నీటికి గురయ్యే స్ట్రీట్ ఫుడ్‌పై ఈగలు, దుమ్ము, కలుషిత నీటి ప్రభావం ఎక్కువగా ఉండటంతో వాటిని తీసుకోవడం ప్రమాదకరం. పేగు ఇన్‌ఫెక్షన్లు వచ్చినప్పుడు తరచూ విరేచనాలు, వికారం, వాంతులు, కడుపు నొప్పి లేదా మంట, ఉబ్బరం, అజీర్ణం, జ్వరం, ఆకలి తగ్గడం, నీరసం, డీహైడ్రేషన్ వంటి లక్షణాలు కనిపిస్తాయి.

# యోగా చేస్తే జ్ఞాపకశక్తి పెరుగుతుందా?

క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల శరీరంతో పాటు మనసు కూడా ఆరోగ్యంగా ఉంటుంది. ఒత్తిడి తగ్గి, కణాల పనితీరు మెరుగుపడటంతో వృద్ధాప్య ప్రభావం నెమ్మదిస్తుంది. దీంతో ఎక్కువ కాలం ఆరోగ్యంగా జీవించే అవకాశం పెరుగుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. క్రమం తప్పకుండా యోగా, వ్యాయామం చేయడం వల్ల శరీరంలోని యాంటీఆక్సిడెంట్ వ్యవస్థ బలపడుతుంది. దీంతో కణాలకు నష్టం కలిగించే ఆక్సిడేటివ్ ఒత్తిడి తగ్గుతుంది. అలాగే శరీరంలో ఇన్‌ఫ్లమేషన్‌ను పెంచే కొన్ని రసాయనాల స్థాయిలు తగ్గుతాయి. ఒత్తిడికి కారణమయ్యే కార్టిసాల్ హార్మోన్ కూడా తగ్గుతుంది. ఫలితంగా గుండె జబ్బులు, మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదం తగ్గుతుంది.

### మెదడు, జ్ఞాపకశక్తికి మేలు:

ఎక్కువకాలం యోగా చేసే వారి మెదడులో జ్ఞాపకశక్తి, ఆలోచన, నిర్ణయాలు తీసుకునే భాగాలు ఆరోగ్యంగా




ఉంటాయి. ప్రాణాయామం వంటి శ్వాస వ్యాయామాలు ఒత్తిడిని తగ్గించి మనసుకు ప్రశాంతతను కలిగిస్తాయి. అలాగే మెదడు కణాల పెరుగుదలకు ఉపయోగపడే BDNF అనే ప్రొటీన్ స్థాయిలు కూడా పెరుగుతాయి.

### బలం, సమతుల్యత:

యోగా వల్ల కండరాలు బలపడతాయి. వెన్నెముక, తుంటి భాగాల చలనం మెరుగుపడుతుంది. సమతుల్యత పెరగడం వల్ల వృద్ధుల్లో పడిపోవడం వంటి ప్రమాదాలు తగ్గుతాయి. ఎముకల బలం కూడా మెరుగుపడి ఆస్టియోపొరోసిస్ ప్రమాదం తగ్గే అవకాశం ఉంటుంది.

### గుండె ఆరోగ్యం, మధుమేహ నియంత్రణ:

యోగా చేయడం వల్ల రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. రక్తప్రసరణ మెరుగుపడుతుంది. దీంతో గుండెపోటు, పక్షవాతం వచ్చే ప్రమాదం తగ్గుతుంది. అలాగే ఇన్సులిన్ పనితీరు మెరుగై టైప్-2 మధుమేహం ఉన్నవారిలో రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉండేందుకు సహాయపడుతుంది.

### వృద్ధులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు:

యోగా అందరికీ మంచిదే అయినప్పటికీ, వృద్ధులు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. గుండె సమస్యలు, ఆర్థరైటిస్ లేదా కీళ్ల మార్పిడి చేసినవారు కొన్ని ఆసనాలను చేయకూడదు. తలను కిందికి వంచే ఆసనాలు లేదా ఎక్కువసేపు మోకాళ్లపై కూర్చునే భంగిమలను నివారించడం మంచిది.

# తుంగభద్ర పరివాహక రాష్ట్రాలతో భేటీ

### 27 హైదవర్ కమిటీ తొలి సమావేశం

### నీటి సమస్యలపై చర్చించనున్న కమిటీ

అమరావతి,జూలై18 తుంగభద్ర పరీవాహక ప్రాంతం లోని ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్ర అధ్యయనం కోసం కేంద్రం ప్రభుత్వం నియమించిన హైపవర్ కమిటీ తొలిసారిగా ఈనెల 27న ఢిల్లీలో కేంద్ర జలసంఘం కార్యాలయంలో సమావేశం కానుంది. సీడబ్ల్యూసీ సభ్యుడుయోగేష్ పైథంకర్ అధ్యక్షతన ఏపీ ఈఎన్‌సీ కె.నరసింహమూర్తి, కర్ణాటక జలవనరుల శాఖ కార్యదర్శి బీఎస్ శివశంకర్, తెలంగాణ ఈఎన్‌సీ ఓవీ రమేష్ బాబు, సీడబ్ల్యూసీ సీఈలు అభిషేక్ బెనర్జీ, సంజయ్ గంగ్వార్, శరబ్‌జీత్‌సింగ్ భక్షీ, ఓంప్రకాష్ గుప్తా సభ్యులుగా ఉన్న ఈ కమిటీకి తుంగభద్ర బోర్డు కార్యదర్శి ఆస్మా ఖాతూన్ సభ్య కార్యదర్శిగా వ్యవహరిస్తారు. గత నెల 25న తుంగభద్ర డ్యామ్ కొత్త గేట్లు ప్రారంభ కార్యక్రమానికి కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తోపాటు ఏపీ, తెలంగాణ, కర్ణాటక సీఎంలు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి, డీకే శివకుమార్ హాజరై ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తుంగభద్ర జలాల వినియోగంలో ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. వాటిపై సమగ్రంగా అధ్యయనం చేసి బచావత్ ట్రిబ్యునల్ అవార్డుకు లోబడి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక ఇచ్చేందుకు హైపవర్ కమిటీని ఏర్పాటు చేస్తామని కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ ప్రకటించారు. ఆ మేరకు హైపవర్ కమిటీని ఏర్పాటు చేస్తూ ఈనెల 11న కేంద్ర జల్ శక్తి శాఖ జాయింట్ కమిషనర్ సంజయ్‌కుమార్‌సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏడు అంశాలపై అధ్యయనం చేసి ఆర్నెల్లలోగా నివేదిక ఇవ్వాలని ఆ కమిటీని నిర్దేశిరచారు. తుంగభద్ర హైపవర్ కమిటీ అధ్యయనం చేసే అంశాలివీ.. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్) కింద చారిత్రక వినివియోగం, నీటి అవసరాలు, నిర్వహణలో ఇబ్బందులు, ప్రస్తుత పరిస్థితిపై అధ్యయనం చేస్తారు. తుంగభద్ర డ్యాంలో ఏ మేరకు పూడిక చేరింది..? దాని వల్ల నీటి నిల్వ సామర్థ్యం ఎంత తవిగ్గింది..? సాగు, తాగునీటి అవసరాలు, జలవిద్యుదుత్పత్తిపై ఏ మేరకు ప్రభావం పడుతోంది..? డ్యామ్ భద్రత, వరద నియంత్రణ చర్యలపై సూచనలు చేస్తారు. తుంగభద్ర డ్యామ్‌లో పూడిక తీతకు సంబంధించి సాంకేతిక, ఆర్థిక అంశాలను పరిశీలించి లాభదాయక మార్గాలను సూచించడం. ఇకపై రిజర్వాయర్‌లో పూడిక చేరకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు. ఆర్డీఎస్‌కు నీటి లభ్యవిత భరోసా కల్పింవిచేందుకు తుంగభద్ర డ్యావిమ్ దిగువన బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించాల్సిన అవసరంతోపాటు ట్రిబ్యునల్ అవార్డులు, ఒప్పందాలు, న్యాయపరమైన ఆమోదంపై అధ్యయనం వంటివి పరిశీలిస్తారు. తుంగభద్ర డ్యామ్‌లో పూడికతీత వల్ల ప్రయోజనం ఉంటుందా? సమాంతరంగా బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించడం వల్ల మేలు జరుగుతుందా? లాంటి అంశాలపై సాంకేతిక, ఆర్థిక సాధ్యాసాధ్యాల పరిశీలన. అంతర్రాష్ట్ర అంశాలు, సామాజిక, పర్యావరణ, న్యాయపరమైన చిక్కులపై అధ్యయనం. కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ తీర్పులకు లోబడి రాష్ట్రాలకు వాటా మేరకు నీరు అందే అవకాశంపై పరిశీలన. అవసరమైతే సబ్ కమిటీలు ఏర్పాటు చేసి ప్రత్యేక ఆహ్వానితులను నియమించుకునేందుకు హైపర్ కమిటీకి అధికారాలు అప్పగించారు.

# కాళేశ్వరం...ఆత్మరక్షణలో కాంగ్రెస్ ప్రభుత్వం !

హైదరాబాద్,జూలై18 దొంగలుపడ్డ ఆరు నెలలకు ...అన్న చందంగా ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు కావస్తున్న తరుణంలో ఇప్పుడు ధరణిపై విచారణకు ఓ కమిటీని వేయాలని రేవంత్ సర్కార్ తీసుకున్న నిర్ణయం నవ్వులు తెప్పించేదిగా ఉంది. కెసిఆర్, బిఆర్ఎస్ అవినీతిపై పెద్దపెద్ద మాటలు మాట్లాడి అధికారంలోకి వచ్చిన రేవంత్ ఇప్పటి వరకు పైసా అవినీతిని నిరూపించ లేకపోయారు. కాళేశ్వరం, ధరణి, ఈ కార్ రేస్, పవర్ ప్లాంట్లు, విద్యుత్ ఒప్పందాలు తదితర అంశాలన్నీ ఇప్పుడు ప్రచార వస్తువుగా మారాయి. కేవలం బిఆర్ఎస్‌పై రాజకీయంగా పైచేయి సాధించేందుకు మాత్రమే విమర్శలు చేస్తున్నారు. ఇందులో ప్రధానంగా కాళేశ్వరం కూలేశ్వరం అంటూ చేసిన ఆరోపణల్లో ఇంచు కూడా ముందుకు కదలలేదు. లక్షకోట్లు పెట్టిన ప్రాజెక్ట్ పడావు పడ్డది. దానిని ఎలాగైనా వినియోగంలోకి తేవడం ద్వారా ప్రజాధనాన్ని కాపాడాలన్న ముందుచూపు లేకుండా పోయింది. ఎంతసేపు రాజకీయంగా విమర్శలు తప్ప ఈ ప్రభుత్వం గత బిఆర్ఎస్ చేసిన అవినీతిపై ఎలాంటి పురోగతి సాధించలేదు. రేవంత్ రెడ్డి దీనిని కేవలం రాజకీయంగా ఉపయోగించు కుని బిఆర్ఎస్‌ను భ్రష్టు పట్టించే యోచనలో ఉన్నారా అన్న అనుమానాలు వస్తున్నాయి. ఎందుకంటే కాళేశ్వరాన్ని పక్కన పెట్టి ఇప్పుడు మళ్లీ ప్రాణహిత అంటూ పల్లవి అందుకున్నారు. ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడం, వినిగింలోకి ఎలా తేవడం అన్న ఆలోచన పక్కన పెట్టారు. అందుకే నిత్యం కాళేశ్వరం ప్రాజెక్టు వివాదం కొనసాగుతూనే ఉంది. రాజకీయ విమర్శలకు కాళేశ్వరం వేదికగా మారుతోంది. పరస్పర విమర్శలు తప్ప గోదావరి జలాలను ఎలా ఉపయోగించుకోవాలన్నది ఆలోచించడం లేదు. కాలేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటి విడుదల వ్యవహారం కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లు, పరస్పర ప్రజెంటేషన్లకు కేంద్రంగా మారింది. ఎల్‌నినో ప్రభావంతో వానలు వెనక్కి పోయాయి. మరో వైపు కాళేశ్వరం నుంచి గోదావరి జలాలు తరలింపు అసాధ్యమని ప్రభుత్వం తేల్చి చెప్పింది. ఈ ప్రాజెక్టును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని పూర్తి చేసినప్పటికీ మెడిగడ్డ వద్ద కొన్ని పిల్లర్లు కుంగడంతో ఇక అది పనికిరాదన్న రీతిలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మోటర్లు, కాలువలు అంతా వృధా అవుతున్నాయి. ఇదే విషయాన్ని బిజెపి ఎంపి ఈటెల రాజేందర్ ప్రస్తావిస్తే.. ఆయనను బిఆర్ఎస్ ఏజెంట్‌గా అభివర్ణించి విమర్శలతో దాడి చేశారు. నిజానికి గత 2023 శాసనసభ ఎన్నికలలో బీఆర్ఎస్ ఓటమిలో కాళేశ్వరం, ధరణి అక్రమాలు ప్రధాన భూమిక పోషించాయి. అధికారంలోకి రావడానికి అనేకానేక హామీలు, వాగ్దానాలు గుప్పించిన రేవంత్ సర్కార్ ఇప్పుడు గుడ్డెద్దు చేలో పడ్డదన్నట్లుగా సాగుతున్నారు. పదికాలాలపాటు పనికి వచ్చే పనులు చేయడం లేదు. ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎలాంటి విధానం అనుసరిం చాలన్న దానిమీద సరైన అవగాహన లేకుండా వ్యవహరిస్తున్నారు. కాళేశ్వరం పిల్లర్లను పునరుద్దరించే ప్రయత్నాలు చేసి, నీటిని వినియోగంలోకి తీసుకుని వచ్చివుంటే, ఈయేడు మంచి ఫలితాలు వచ్చేవి. ప్రభుత్వానికి మంచిపేరు వచ్చేది. కానీ కాళేశ్వరం ప్రాజెక్టను ఉపయోగించరాదన్న మొండి వైఖరితో రేవంత్ ఉన్నట్లుగా కనిపిస్తోంది. ఆ ప్రాజెక్టు భద్రత ప్రమాదంలో ఉందని నేషనల్ డామ్ సేఫ్టి అథారిటి చెప్పిందని, అందువల్ల అక్కడ నీటిని వినియోగంలోకి తసీఉకుని రావడం అసాధ్యమని చెబుతున్నారు. కాళేశ్వరం ఎటిఎంగా మారిందని గతంలో బిజెపి కూడా ఆరోపించింది. రేవంత్ రెడ్డి కూడా ఇదే ప ÷-రచారం చేశారు. పోనీ అలాగని ఇందులో జరిగిన అవినీతిని వెలికితీసి కెసిఆర్ తదితరులను దోషులుగా నిలబెట్టి ఉంటే రేవంత్ ఇమేజ్ పెరిగేది. కానీ ఆరోపణలతోనే రెండున్నరేళ్లుగా కాలయాపన చేస్తున్నారు. కాళేశ్వరం కమిషన్‌ను కూడా ఏర్పాటు చేశారు. జస్టిస్ పిసి ఘోష్ కమిటీ రిపోర్టుపై హైకోర్టు స్టే విధించింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, అప్పటి ఇరిగేషన్ మంత్రి హరీష్ రావులను అరెస్టు చేస్తారేమో అన్నంతగా ప్రచారం జరిగింది. అంతా తుస్సుమంది.ఇప్పుడు కమిషన్ రిపోర్టుకు కూడా పెద్ద విలువ లేకుండా పోయిందా అన్న అనుమానాలు వస్తున్నాయి. ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టు బారేజీలైన మేడిగడ్డ, అన్నారం,

# అమరుల యాదిలో గీతన్నల చైతన్య యాత్ర

**వర్ధన్నపేట జూలై 18, తరంగాలు** : గీత కార్మికుల సమస్యల పరిష్కారం, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు కోసం "అమరుల యాదిలో గీతన్నల చైతన్య యాత్ర" నిర్వహించనున్నట్లు కల్లు గీత కార్మిక సంఘం నాయకులు ప్రకటించారు. ఈ చైతన్య యాత్ర ఆగస్టు 2 నుంచి 18 వరకు మానుకోట నుంచి హైదరాబాద్ ట్యాంక్‌బండ్ వరకు కొనసాగనున్నట్లు తెలిపారు. శనివారం వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలోని తాటి వనంలో అమరుల యాదిలో గీతన్నల చైతన్య యాత్ర కు సంబంధించిన వాల్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని కల్లుగీతా కార్మిక సంఘం వర్ధన్నపేట మండల అధ్యక్షులు జనగాం యాకయ్య గౌడ్, జిల్లా సలహాదారులు సట్ల సూరయ్య గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా గౌరవ అధ్యక్షులు పులి సోమయ్య గౌడ్, జిల్లా అధ్యక్షులు తాళ్లపెల్లి నర్సయ్య గౌడ్, జిల్లా సహాయ కార్యదర్శి బాలగోయిన రాంబాబు గౌడ్,జిల్లా సలహాదారులు సట్ల సూరయ్య గౌడ్ హాజరై కల్లుగీతా కార్మిక సంఘం నాయకులతో కలిసి అమరుల యాదిలో గీతన్నల చైతన్య యాత్ర వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్రంలోని గీత కార్మికులు ఎన్నో సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

వారు ప్రధానంగా చేసిన డిమాండ్లు ఇవి:

గీత కార్మికులకు నెలకు రూ.4,000 పెన్షన్ మంజూరు చేయాలి.



ప్రమాదాల్లో మృతి చెందిన గీత కార్మికుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా రూ.10 లక్షలకు పెంచాలి.

పెండింగ్‌లో ఉన్న రూ.20 కోట్ల ఎక్స్‌గ్రేషియా నిధులను వెంటనే బాధిత కుటుంబాలకు విడుదల చేయాలి.

ప్రతి గౌడ సహకార సంఘానికి 5 ఎకరాల భూమి కేటాయించాలి.

ఆగస్టు 18న సర్వాయి పాపన్న జయంతి సందర్భంగా హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై సర్వాయి పాపన్న విగ్రహాన్ని ప్రతిష్ఠించాలి.

సర్వాయిపేట, తాటికొండ, ఖిలాషాపురం తదితర చారిత్రక కోటలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలి.

గీత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం తక్షణమే సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ చైతన్య యాత్రలో పెద్ద సంఖ్యలో గీత కార్మికులు, గౌడ సంఘాల ప్రతినిధులు పాల్గొని ప్రభుత్వానికి తమ డిమాండ్లను వినిపించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ల్యాబర్తి గౌడ సంఘం అధ్యక్షులు బత్తిని రాజబాబు గౌడ్, రాయపర్తి మండల గౌరవాధ్యక్షులు తేరాల సదానందం గౌడ్, సంగెం మండల కార్యదర్శి మచ్చ గురువయ్య, వర్ధన్నపేట మండల కార్యకర్తలు సట్ల అనిల్,దొమ్మటి పృథ్వీరాజ్, కల్లుగీత కార్మిక సంగం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం





- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- రైజ్ హర్--2026 మహిళా సాధికారత సదస్సులో పాల్గొన్న వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య

**హైదరాబాద్, జులై 18,తరంగాలు** : మహిళల సాధికారత,ఆర్థిక స్వావలంబనకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. హైదరాబాద్,రెడ్ హిల్స్ లో తెలంగాణ ఎస్సీ/ఎస్టీ ఇండస్ట్రియల్ చాంబర్ ఆఫ్ కామర్స్ (టీఎస్ఐసీసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన రైజ్ హర్--26 మహిళా సాధికారత సదస్సు కార్యక్రమానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, మహిళల సంక్షేమం, సాధికారత, ఆర్థిక స్వావలంబనకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మహిళలు ఎల్లప్పుడూ పాజిటివ్ ఎనర్జీతో ముందుకు సాగాలని, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ "పే బ్యాక్ టూ సొసైటీని ప్రతి ఒక్కరిని అలవర్చుకోవాలని సూచించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షిస్తూ జాతీయ గౌరవాన్ని పెంపొందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించి అన్ని రంగాల్లో సమాన అవకాశాలు అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సెల్ఫ్ హెల్ప్ గ్రూపులను మరింత బలోపేతం చేస్తూ మహిళల్లో పొదుపు, స్వయం ఉపాధి, పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహిస్తోందని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరు జీవితాంతం నిత్య విద్యార్థులుగా నేర్చుకుంటూ ముందుకు సాగాలని, ముఖ్యంగా ఎస్సీ మహిళలు విద్య, ఉద్యోగం, వ్యాపారం, నాయకత్వ రంగాల్లో మరింత ముందుకు వచ్చి సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. మహిళలు ఆత్మవిశ్వాసంతో తమ ప్రతిభను చాటుకుని, అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటే కుటుంబం, సమాజం, రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, ఇండస్ట్రియల్ కామర్స్ డిపార్ట్మెంట్ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాస్ నాయక్, పి ఎం ఈ జీపీ రవి, ఎస్బీఐ లీడ్ డిస్టిక్ మేనేజర్ మూర్తి,వి హబ్ డైరెక్టర్ జావేద్ అక్తర్ షేక్ ,టీ ఎస్ ఐ సీసీ ప్రెసిడెంట్ నల్ల బాబు తదితరులు పాల్గొన్నారు.



# గోదావరి నదిలో వేటకెళ్లి ఐదుగురు మృతిపై సీఎం చంద్రబాబు విచారం

అమరావతి, జూలై 18 పోలవరం జిల్లా ఎటపాక మండలం గొల్లగూడెం వద్ద గోదావరి నదిలో ఐదుగురు మృతి చెందిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. గోదావరి నదిలో చేపల వేటకు వెళ్లి ఐదుగురు గల్లంతయ్యారన్న విషయంపై ముఖ్యమంత్రి అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. గొమ్ముకొత్తగూడెంనకు చెందిన తుర్రం భారతి, ఊకే సుశీల, ఊకే లక్ష్మి, బాసిబోయిన బాలరాజు, ఊకే రమేష్ అనే ఐదుగురు వేటకు వెళ్లి మృత్యువాత పడినట్లు అధికారులు సీఎంకు వివరించారు. మృతుల కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఐదుగురు మృతి చెందిన ఘటనపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ విచారం వ్యక్తం చేశారు. దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పోలవరం జిల్లా కలెక్టర్ తో మాట్లాడి ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందించాలని అధికారులకి దిశానిర్దేశం చేశారు.

# ఐదుగురు మృతి ఘటనపై దిగ్భ్రాంతి

### డిప్యూటి సిఎం పవన్, హోంమంత్రి అనిత సంతాపం

అమరావతి,జూలై18 పోలవరం జిల్లా ఏటపాక మండల పరిధిలోని గొల్లగూడెం వద్ద గోదావరి నదిలో చేపల వేటకు వెళ్లి ఐదుగురు మృతి చెందిన ఘటన దిగ్భ్రాంతి కలిగించిందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పోలవరం జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకున్నట్లు చెప్పారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందించాలని అధికారులకు దిశానిర్దేశర చేశామని పవన్ కల్యాణ్ వెల్లడించారు. గోదావరి నదిలో ఐదుగురు మృతి చెందిన ఘటనపై హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనపై జిల్లా కలెక్టర్, ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడి పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మృతిచెందిన ఐదుగురి కుటుంబాలకు హోంమంత్రి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బాధిత కుటుంబాలకు తక్షణ సహాయ చర్యలు అందేలా చూడాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని హోంమంత్రి వంగలపూడి అనిత ఆకాంక్షించారు.

# రోగులకు సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలి





•ఈఎస్ఐ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన తెలంగాణ ప్రభుత్వ కార్మిక, ఉపాధి, శిక్షణ
•మరియు ఫ్యాక్టరీల శాఖ కార్యదర్శి హరి చందన దాసరి

**హనుమకొండ ప్రతినిధి , జులై 18, తరంగాలు :** రాష్ట్ర ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్, తెలంగాణ ప్రభుత్వ కార్మిక, ఉపాధి, శిక్షణ అండ్ ఫ్యాక్టరీల శాఖ కార్యదర్శి దాసరి హరిచందన, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ తో కలిసి శనివారం వరంగల్ లేబర్ కాలనీలోని ఈఎస్ఐ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి వైద్య సేవలను పరిశీలించారు. ఆసుపత్రిలోని వివిధ వార్డులను సందర్శించిన హరి చందన దాసరి, చికిత్స పొందుతున్న రోగులను నేరుగా కలిసి వారి ఆరోగ్య పరిస్థితి, అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, వైద్య సిబ్బంది స్పందన తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. రోగుల సమస్యలను ఓర్పుగా విని, వారికి నాణ్యమైన, సకాలంలో వైద్య సేవలు అందేలా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యాధికారులతో సమావేశమై ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలు, మౌలిక వసతులు, వైద్యులు, సిబ్బంది లభ్యత, మందుల నిల్వలు, రోగులకు అందుతున్న సేవలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా హరి చందన దాసరి మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు అందించడం అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని అన్నారు. ఆసుపత్రిలో ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే గుర్తించి సత్వర పరిష్కార చర్యలు చేపట్టాలని, రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వైద్య సేవలను మరింత మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి పరిశుభ్రత, ఔషధాల లభ్యత, వైద్య సేవల నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వై.వి. గణేష్, ఈఎస్ఐ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కాంతి సాగర్, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ హేమలత, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# కూటమి దోపిడీకి అడ్డూ అదుపులేకుండా పోయింది

○అనకాపల్లి జిల్లాలో పంచభూతాల దోపిడీ
○మాజీమంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆరోపణలు



అనకాపల్లి,జూలై18 కూటమి పాలనలో దోపిడీకి హద్దు లేకుండాపోతోందని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ ఆరోపించారు. అనకాపల్లి జిల్లాల్లో పంచ భూతాలను ఎంపీ సీఎం రమేష్ దోచుకుంటున్నారని అమర్నాథ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మహా పాపానికి కూటమి నేతలు ఒడిగట్టారు అంటూ మండిపడ్డారు. అనకాపల్లి జిల్లాలోని ఎలమంచిలిలో పంచదారల కొండపై అక్రమ మైనింగ్‌కు వ్యతిరేకంగా గ్రామస్తులు రిలే నిరాహార దీక్షలకు దిగారు. వారి రిలే దీక్షలకు వైఎస్సార్‌సీపీ నేతలు కురసాల కన్నబాబు, గుడివాడ అమర్నాథ్, దాడిశెట్టి రాజా, కరణం ధర్మశ్రీ, బొడ్డేడ ప్రసాద్ సంఘీభావం తెలిపారు. ఈ క్రమంలో రిలే నిరాహార దీక్షను సందర్శించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ మాట్లాడుతూ..'ఎంపీ సీఎం రమేష్ దోపీడీ పీక్ స్టేజ్‌కు చేరుకుంది. కొండలను పిండి చేస్తున్నారు. వందల లారీలతో గ్రావెల్ తరలిస్తున్నారు. పవిత్రమైన పంచదార్ల కొండను మింగేస్తున్నారు. మహా పాపానికి కూటమి నేతలు ఒడిగట్టారు. సనాతన ధర్మం గురించి మాట్లాడే పవన్ కళ్యాణ్ ఏమైపోయారు?. 1200 ఏళ్ల చరిత్ర కలిగిన పంచదార కొండను ధ్వంసం చేస్తున్నారు. ఈ పాపానికి పవన్ కళ్యాణ్ ఏం ప్రాయశ్చిత్తం చేస్తారు?' అని ప్రశ్నించారు. కురసాల కన్నబాబు మాట్లాడుతూ..'దొంగలు దొంగలు ఉళ్లు పంచుకున్నట్లు దోపిడీకి కూటమి నేతలు పాల్పడుతున్నారు. కొండలను మాయం చేస్తున్నారు. పర్యావరణానికి విఘాతం కల్పిస్తున్నారు. కడప నుంచి సీఎం రమేష్ ప్రజా సేవకు వచ్చారు అనుకున్నాం. వారి కంపెనీల పేరు మీద పర్మిట్లతో కొండలను మింగేస్తున్నారు. సనాతన ధర్మం గురించి మాట్లాడే నాయకులు తెల్లవారితే ఉమా ధర్మ లింగేశ్వర స్వామి దేవాలయానికి గుండు కొడుతున్నారు. ఇక్కడ జరుగుతున్న అన్యాయాన్ని వైఎస్ జగన్ దృష్టికి తీసుకువెళ్తాం. ఈ నెల 21వ తేదీన చలో పంచదార్ల కార్యక్రమం నిర్వహిస్తాం. 30 కిలోమీటర్ల పరిధిలో ఉన్న పంచదార్ల కొండలను నో మైనింగ్ జోన్ గా ప్రకటించాలి. మైనింగ్ లీజులు సోమవారం లోపు రద్దు చేయాలి అని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి దాడి శెట్టి రాజా మాట్లాడుతూ..'మహా పవిత్రమైనవి పంచదార్ల కొండలు. ఈ కొండ గురించి మహా భారతంలో ప్రస్తావన ఉంది. చోళుల కాలంలో ఉమా ధర్మ లింగేశ్వర స్వామి దేవాలయాన్ని నిర్మించారు. పంచదార్ల కొండపై జరుగుతున్న అక్రమ మైనింగ్ సనాతన వాదులకు కనిపించలేదా?. సంపద సృష్టి పేరుతో వారసత్వ సంపదను దోచుకుంటున్నారు. ఎక్కడ నుంచో వచ్చి ఉత్తరాంధ్ర సంపాదనను దోచుకుంటున్నారు అని మండిపడ్డారు. కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ.. 'పంచదార్ల కొండపై కూటమి అనకొండలు పడ్డాయి. కొండలను ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్ గద్దల్లా దోచుకుంటున్నారు. అక్రమ మైనింగ్ పై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. 30 కిలో మీటర్ల పరిధిలో పంచదార్ల కొండలు విస్తరించి ఉన్నాయి. ప్రజలకు జీవనాధారం ఈ కొండలు' అని చెప్పుకొచ్చారు.

# బుల్లెట్ ట్రైన్ కోసం భూ సేకరణ

○బహద్దూర్ గూడ వద్ద తీవ్ర ఉద్రిక్తత
○అధికారుల తీరుపై రైతుల మండిపాటు
○భూముల జోలికి వస్తే ఊరుకోబోమని హెచ్చరిక
○ఐదురోజులుగా కొనసాగుతున్న ఆందోళన



రంగారెడ్డి,జూలై18: శంషాబాద్ బహదూర్ గూడలో ఉద్రిక్తత నెలకొంది. బుల్లెట్ ట్రైన్ కోసం భూములు ఇచ్చేందుకు రైతులు నిరాకరిస్తున్నారు. బహదూర్ గూడా భూముల దగ్గరకు హైడ్రా అధికారులు భారీగా చేరుకున్నారు. భూముల వ్యవహారంలో ఐదు రోజులుగా రైతుల ఆందోళన కొనసాగుతోంది. స్పష్టమైన హామీ ఇచ్చాకే భూములు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో..బహదూర్‌గూడ భూముల జోలికొస్తే ఖబర్దార్ అంటూ.. రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి హెచ్చరించారు. హైడ్రా కానీ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల కోసం పనిచేస్తుందని అనుకున్నాం. కానీ మీరు బ్లాక్ మెయిలర్‌లు ప్రజలను భయపెట్టడానికి వచ్చిన హైడ్రా అంటూ విరుచుకుపడ్డారు. బహదూర్‌గూడా భూములపై స్టాటస్‌కో ఉంది కాబట్టి జిల్లా కలెక్టర్ కోర్టు అనుమతి లేకుండా భూముల జోలికి వస్తే ఊరుకునేది లేదని ప్రజాక్షేత్రంలో నిలబెడతామని అన్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం బహదూర్‌గూడలో చేపట్టిన రైతు నిరసన ఐదో రోజుకు చేరింది. రైతులకు ఈరోజు మద్దతుగా బీఆర్ఎస్ పార్టీ రాజేందర్ నగర్ ఇంచార్జ్ పట్ల కార్తీక్ రెడ్డి నిలబడ్డారు. బహదూర్ గూడ లోని వ్యవసాయ పొలాలని తరతరాలుగా సాగు చేసుకుంటూ వస్తున్న ప్రజలకు బులెట్ ట్రైన్ పేరుతో లాక్కోవాలని చూస్తుంది. కానీ ముమ్మాటికి రైతుల పక్షాన ఉండి పోరాడుతాం, ఎక్కడికైనా వెళతాం కానీ రైతుల భూములను లాక్కునే ప్రసక్తి లేదంటూ ప్రభుత్వానికి సవాల్ విసిరారు. భూముల రైతులను పిలిచి బెదిరించి భూములను తీసుకునే ప్రయత్నం చేస్తున్నారని తెలిసింది. కానీ బీఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన నిలబడుతుందని ఎట్టి పరిస్థితుల్లో రైతులకు అన్యాయం జరగకుండా చూస్తామని రైతులకు హామీ ఇచ్చారు. రానున్న 2 సంవత్సరాల్లో కెసిఆర్ ప్రభుత్వం రాబోతుంది కాబట్టి బహదూర్ గూడా రైతులు ఎట్టి పరిస్థితుల్లో ఆందోళన చెందొద్దని అందరికీ కెసిఆర్ చేతుల మీదుగా పట్టా, పాసు పుస్తకాలు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు.

# చరిత్రను తెలుసుకోవడం, వారసత్వ సంపదను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత






• వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

**హైదరాబాద్, జులై 18,తరంగాలు** :చరిత్రను తెలుసుకోవడం, వారసత్వ సంపదను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. హైదరాబాద్, ఖాజాగుడా,మహాలక్ష్మి కోర్ట్‌యార్డ్ లో నిర్వహించిన "హెరిటేజ్ ఏ ఎవరీ స్టెప్ 2.0" ప్రదర్శనకు వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రదర్శనలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని చారిత్రక ఆధారాలు, గ్రామాలు, దేవాలయాలు, శాసనాలు, పురాతన కట్టడాలు, పురావస్తు ప్రదేశాలకు సంబంధించిన అరుదైన చారిత్రక విశేషాలను వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య పరిశీలించారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ,మన పూర్వీకులు అందించిన అమూల్యమైన చారిత్రక, సాంస్కృతిక వారసత్వ సంపదను భావితరాలకు చేరవేయడం మనందరి బాధ్యత అని అన్నారు. చరిత్ర గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, దానిని అధ్యయనం చేయడం ద్వారా సమాజం తన మూలాలను, సంస్కృతిని మరింత లోతుగా అర్థం చేసుకోగలదని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు యువతలో చరిత్ర పట్ల ఆసక్తిని పెంపొందించడంతో పాటు వారసత్వ పరిరక్షణకు ప్రేరణగా నిలుస్తాయని తెలిపారు. ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ చేపడుతున్న ప్రెసెర్వే హెరిటేజ్ ఫర్ పోస్టరిటీ కార్యక్రమం ద్వారా మరుగున పడిన ఎన్నో చారిత్రక, పురావస్తు విశేషాలను వెలుగులోకి తీసుకువస్తున్న ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ ఈ. శివనాగిరెడ్డి కృషిని ఎంపీ ప్రత్యేకంగా అభినందించారు. విలువైన పురాతన సంపదను గుర్తించి, దాని ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేస్తూ చరిత్ర పరిరక్షణకు విశేష సేవలు అందిస్తున్నందుకు ఆయనను కొనియాడారు. ఈ సందర్భంగా డాక్టర్ ఈ. శివనాగిరెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చరిత్రాభిమానులు, పరిశోధకులు, విద్యార్థులు, సాంస్కృతిక రంగ ప్రతినిధులు పాల్గొన్నారు.



THARANGALU DAILY NEWS
ఆదివారం, 19 జూలై, 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

## రామ్‌చరణ్-సుకుమార్ కాంబో


**ఆర్17 పట్టాలకెక్కనుందని ప్రచారం**



ఈ ఏడాది పెద్ది సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్టందుకున్న రాంచరణ్ మరోమారు సుకుమార్‌తో సినిమాకు సిద్దం అవుతున్నారు. వీరి కాంబో రంగస్థలం బాక్సాఫీస్‌ను షేక్ చేసిందని తెలిసిందే. ఈ ఇద్దరి క్రేజీ కాంబోలో మరోసారి ఆర్‌సీ 17సందడి చేసేందుకు రెడీ అవుతోంది. మూవీ లవర్స్‌తోపాటు అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న అప్‌డేట్ ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. తాజా టాక్ ప్రకారం ఆర్‌సీ17 మూవీ ఫైనల్ స్క్రిప్ట్ పూర్తయింది. మేకర్స్ త్వరలోనే గ్రాండ్‌గా ఈ సినిమాను షురూ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారని ఫిలింనగర్ సర్కిల్ సమాచారం. అన్నీ అనుకున్నట్టు కుదిరితే వచ్చే సెప్టెంబర్‌లోనే సినిమా లాంచ్ కానుందట. అంతేకాదు నవంబర్ నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు కానుందని ఇన్‌సైడ్ టాక్. రంగస్థలం తర్వాత సుకుమార్-రాంచరణ్ కాంబోలో వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలపై త్వరలోనే మేకర్స్ క్లారిటీ ఇవ్వనున్నారు. ఈ చిత్రానికి రాక్‌స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ మ్యూజిక్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడని వార్తలు రాగా.. మరోవైపు ధురంధర్ శశ్వత్ సచ్‌దేవ్ పేరు కూడా తెరపైకి వచ్చింది. రాంచరణ్ నిర్మాతగా నిఖిల్ హీరోగా నటిస్తోన్న ఇండియా హౌస్ చిత్రానికి కూడా శశ్వత్ సచ్‌దేవ్ సంగీతం అందిస్తున్నాడు.

## ప్రియాంక చోప్రా బర్త్‌డే

**విషెస్ చెబుతూ వారణాసి లుక్ విడుదల**



మహేశ్ బాబు కథానాయకుడిగా రాజమౌళి దర్శకత్వంలో రానున్న చిత్రం 'వారణాసి'లో మహేశ్‌కు జోడీగా బాలీవుడ్ నటి ప్రియాంక కనిపించనున్న విషయం తెలిసిందే. మందాకిని పాత్రలో ఆమె సందడి చేయనున్నారు. శనివారం ఆమె పుట్టినరోజు సందర్భంగా సినిమా సెట్‌లోని ఫొటోలను విడుదల చేస్తూ రాజమౌళి పోస్ట్ పెట్టారు. 'ఆమె నవ్వితే అందం.. నవ్వకపోతే నిప్పు కణిక' అనే క్యాప్షన్ పెట్టారు. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మహేశ్ కూడా ప్రియాంకకు విషెస్ చెప్పారు. 'మా ఒకే ఒక్క మందాకినికి హ్యాపీ బర్త్‌డే..' అని పోస్ట్ పెట్టారు. ప్రియాంక 'వారణాసి' కోసం 14 నెలల నుంచి షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఇందులో అద్భుతమైన స్లో మోషన్ జంప్స్ చేసినట్లు ఆమె చెప్పారు. ఇక ఈ చిత్రంలో రుద్ర, శ్రీరాముడిగా మహేశ్ ద్విపాత్రాభినయం చేస్తున్నారు. ప్రపంచంతో పాటు కాలాల్ని చుట్టేసే సాహసికుడి కథగా ఇది ముస్తాబవుతున్నట్లు తెలిసిందే. భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో రానున్న ఈ సినిమా వచ్చే ఏడాది ఏప్రిల్ 7న విడుదల కానుంది. ఈ ఏడాది అక్టోబర్ నాటికి చిత్రీకరణ పూర్తి చేసి ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. ప్రియాంక చోప్రా ఫొటోస్ రిలీజ్ నేపథ్యంలో సోషల్ మీడియాలో మరోసారి ఆసక్తికర ప్రచారం మొదలైంది. మహేశ్ బాబు పుట్టినరోజు సందర్భంగా ఆగస్టు 9న వారణాసి తొలి గ్లింప్స్‌ను విడుదల చేయనున్నట్లు అభిమానులు, ఫ్యాన్ పేజీలు పెద్ద ఎత్తున పోస్టులు చేస్తూ హల్‌చల్ చేస్తున్నాయి. 'బాబు బర్త్‌డేకు భారీ సర్‌ప్రైజ్', 'బాబు బర్త్‌డేకు గ్లింప్స్ లోడింగ్'. 'ఆగస్టు 9న ఇంతకుముందెన్నడూ చూడని హైప్ చూడబోతున్నారు' అంటూ అభిమానులు సోషల్ మీడియా వేదికగా పోస్టులు షేర్ చేస్తున్నారు. దీంతో హ్యాష్‌ట్యాగ్‌లు ట్రెండింగ్‌లో ఉన్నాయి.

## నాని ప్యారడైజ్‌కు భారీ డిమాండ్



నాచురల్ స్టార్ నాని నటిస్తున్న తాజా చిత్రం 'ది ప్యారడైజ్' విడుదలకు ముందే ట్రేడ్ వర్గాల్లో భారీ రికార్డ్స్ సృష్టిస్తుంది. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత దర్శకుడు శ్రీకాంత్ ఓదెలతో నాని మరోసారి జతకట్టడంతో ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఇప్పుడు ఆ అంచనాలకు తగ్గట్టుగానే ఈ చిత్రం థియేట్రికల్ బిజినెస్‌లో కొత్త రికార్డులు సృష్టిస్తుంది. తాజా సినీ వర్గాల సమాచారం ప్రకారం.. 'ది ప్యారడైజ్' నైజాం థియేట్రికల్ హక్కులను మైత్రీ డిస్ట్రిబ్యూటర్స్ రూ.37 కోట్లకు సొంతం చేసుకుంది. నాని కెరీర్‌లో ఇప్పటివరకు ఏ చిత్రానికీ ఈ స్థాయిలో నైజాం బిజినెస్ జరగకపోవడంతో ఇది రికార్డు డీల్‌గా నిలిచింది. సినిమా విడుదలకు ఇంకా సమయం ఉండటంతో ఇతర ప్రాంతాల నుంచి కూడా భారీ ఆఫర్లు వచ్చే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# ఇన్‌స్టాలో దుమ్మురేపిన ఫౌజీ

**ఫస్ట్‌లుక్ విడుదల కాగానే 5.33 లక్షల లైక్స్**




రెబల్ స్టార్ ప్రభాస్ సినిమా అంటే థియేటర్లలో మాత్రమే కాదు, సోషల్ మీడియాలోనూ అభిమానుల సందడి ఏ స్థాయిలో ఉంటుందో మరోసారి నిరూపితమైంది. తాజాగా విడుదలైన ఫౌజీ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ ఇన్‌స్టాగ్రామ్‌లో అరుదైన రికార్డును నమోదు చేసి, భారతీయ సినీ ప్రమోషన్లకు కొత్త బెంచ్‌మార్క్‌ను సెట్ చేసింది. తాజా గణాంకాల ప్రకారం, 'ఫౌజీ' ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలైన తొలి 24 గంటల్లోనే ఏకంగా 5.33 లక్షల షేర్లు సాధించింది. దీంతో ఇన్‌స్టాగ్రామ్‌లో అత్యధికంగా షేర్ చేయబడిన సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌గా ఇది కొత్త రికార్డును సృష్టించింది. అభిమానులు ఈ పోస్టర్‌ను భారీ స్థాయిలో షేర్ చేస్తూ సోషల్ మీడియాలో ఒక డిజిటల్ వేడుకలా మార్చేశారు. ఈ రికార్డు ప్రభాస్ డిజిటల్ క్రేజ్‌కు మరో నిదర్శనంగా మారింది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఈసారి ప్రభాస్ మరో హీరో రికార్డును కాదు, తన సొంత రికార్డునే బద్దలు కొట్టారు. గతంలో 'స్పిరిట్' ఫస్ట్ లుక్ పోస్టర్ 5.19 లక్షల షేర్లతో అగ్రస్థానంలో ఉండగా, ఇప్పుడు 'ఫౌజీ' దానిని అధిగమించి మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. దీంతో సోషల్ మీడియాలో ప్రభాస్ ఆధిపత్యం మరింత బలపడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ పోస్టర్ అభిమానులను అంతగా ఆకట్టుకోవడానికి ప్రధాన కారణం అందులో కనిపించిన ప్రభాస్ లుక్. ఒక వార్ ్గ÷ట్ లో గాయాలతో కూర్చుని ఉన్న ఆ రూపం చాలా క్రేజీగా కనిపిస్తోంది. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన ప్రతి అప్‌డేట్‌కు సోషల్ మీడియాలో అద్భుతమైన స్పందన లభిస్తోంది. ఫస్ట్ లుక్‌తో వచ్చిన ఈ రికార్డు సినిమా చుట్టూ
ఉన్న హైప్‌ను మరింత పెంచింది. ప్రభాస్ అభిమానులతో పాటు, సినీ ప్రేక్షకులు కూడా ఈ సినిమాపై భారీ అంచనాలు పెట్టుకున్నారు. హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ పీరియడ్ వార్ డ్రామాను మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. ప్రభాస్ పవర్‌ఫుల్ రోల్ లో తెరకెక్కుతున్న ఈ మూవీ డిసెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. విడుదలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ, సోషల్ మీడియాలో ఇప్పటికే 'ఫౌజీ' సృష్టిస్తున్న సంచలనం చూస్తుంటే, ఈ సినిమా కోసం అభిమానులు ఎంత ఆసక్తిగా ఎదురుచూస్తున్నారో స్పష్టంగా తెలుస్తోంది.

# మరోమారు వార్తల్లో నటి నమిత

**స్లిమ్‌గా మారిన ఫోటోలతో నెటిజన్ల ఆసక్తి**



ఒకప్పుడు టాలీవుడ్, కోలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా వరుస సినిమాలతో ప్రేక్షకులను అలరించిన నమిత ఇప్పుడు మరోసారి వార్తల్లో నిలిచారు. పెళ్లి తర్వాత సినిమాలకు దూరంగా ఉంటూ కుటుంబ జీవితంలో బిజీగా గడుపుతున్న ఆమె.. తాజాగా తన ఫిట్‌నెస్ ట్రాన్స్‌ఫర్మేషన్‌తో సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారారు.ఒకప్పుడు బొద్దుగా కనిపించిన నమిత.. ఇప్పుడు పూర్తిగా స్లిమ్‌గా మారి అభిమానులను ఆశ్చర్యపరుస్తున్నారు. జిమ్‌లో కఠినంగా వర్కౌట్స్ చేస్తున్న వీడియోను ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేశారు. మీ మనసు ఏదైతే నమ్ముతుందో.. మీ శరీరం దానినే అనుసరిస్తుంది అనే సందేశాన్ని కూడా ఆ వీడియోకు జత చేశారు. ఈ వీడియో వైరల్ కావడంతో అభిమానులు, నెటిజన్లు వరుసగా కామెంట్లు చేస్తున్నారు. ఇంత స్లిమ్‌గా మారారు ఏంటి?, నిజంగా ఇది నమితేనా?, స్టైలిష్ లుక్ అదిరిపోయింది అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు. చాలా మంది ఆమె కొత్త లుక్‌ను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. నమిత సినీ ప్రయాణాన్ని పరిశీలిస్తే.. కన్నడ, తమిళ, తెలుగు, హిందీ భాషల్లో పలు చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. తెలుగులో 'సొంతం' సినిమాతో ఎంట్రీ ఇచ్చిన ఆమె.. 'ఒక రాజు ఒక రాణి', 'ఓ రాధ ఇద్దరు కృష్ణుల పెళ్లి', 'బిల్లా', 'నాయకుడు', 'సింహా', 'మన్యం పులి' వంటి చిత్రాల్లో నటించారు. ముఖ్యంగా బాలకృష్ణ నటించిన 'సింహా' సినిమాలో ఆమె గ్లామర్, నటన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పెళ్లి అనంతరం సినిమాలకు విరామం ఇచ్చిన నమిత గత కొన్నేళ్లుగా పూర్తిగా కుటుంబ జీవితానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. అయితే తాజాగా ఆమె ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టి సరికొత్త లుక్‌లో కనిపించడంతో.. త్వరలోనే మళ్లీ వెండితెరపై రీఎంట్రీ ఇవ్వబోతున్నారా? అనే చర్చ సినీ వర్గాల్లో మొదలైంది. అయితే దీనిపై నమిత నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

# ఓటిటిలోకి బాలన్..ది బాయ్



'మంజుమ్మల్ బాయ్స్' చిత్రంతో మలయాళంతో పాటు తెలుగులోనూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు దర్శకుడు చిదంబరం. ఆయన దర్శకత్వంలో వచ్చిన చిత్రం 'బాలన్ - ది బాయ్'. చందు సలీమ్ కుమార్, టొవినో థామస్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా ఇటీవల విడుదలై పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఇప్పుడీ సినిమా ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. జులై 31 నుంచి జీ5 వేదికగా స్ట్రీమింగ్ కానుంది. మలయాళంతో పాటు తెలుగు, హిందీ, తమిళ, కన్నడ భాషల్లో అందుబాటులోకి రానుంది. హత్య కేసులో జైలుకు వెళ్లిన మహిళ అక్కడ ఓ అబ్బాయికి జన్మనిస్తుంది. శిక్ష పూర్తయి బయటకు వచ్చాక తన గతం గురించి ఎవరికీ చెప్పకుండా మారుపేర్లతో అన్ని ప్రాంతాలు తిరుగుతూ ఉంటుంది. కల్లోలభరితమైన బాల్యం, ఆ తర్వాత అదృశ్యమైన తన తల్లి కోసం వెతుకుతున్న ఒక టీనేజ్ అబ్బాయి కథగా 'బాలన్ - ది బాయ్' రూపొందింది. మే నెలలో జరిగిన కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లోనూ ఈ చిత్రాన్ని ప్రదర్శించారు. సినీ ప్రముఖులు సూర్య, నాగచైతన్య తదితరులు ఈ సినిమాపై ప్రశంసలు కురిపించారు.

# రవాణాశాఖ నిబంధలను కఠినతరం

**నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై నజర్ తనిఖీలు ముమ్మరం చేయనున్న అధికారులు**

హైదరాబాద్,జూలై18 :రాష్ట్రవ్యాప్తంగా రవాణా నిబంధనలను కఠినతరం చేశారు. ఉల్లంఘించే వాహనాలపై ఉక్కుపాదం మోపాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించడంతో అధికారులు తగు చర్యలకు దిగుతున్నారు. ముఖ్యంగా స్కూల్ బస్సులతో పాటు, అధికా లోడ్‌తో వెళ్లే వాహనాలపై దృష్టి సారించారు. రవాణా శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యకలాపాలను మరింత విస్తృతం చేసి, నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఓవర్‌లోడింగ్ వాహనాలు, త్రైమాసిక పన్నులు చెల్లించని వాహనాలు, ఫిట్‌నెస్ సర్టిఫికేట్ లేని వాహనాలపై ప్రత్యేక నిఘా పెట్టారు. రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు చేపట్టి, నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనాలను అవసరమైతే వెంటనే సీజ్ చేయాలని రవాణా అధికారులు క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. గతంలో చెక్‌పోస్టులను రద్దు చేసిన సమయంలోనే ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను మరింత బలోపేతం చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అందువల్ల ప్రస్తుతం అందుబాటులో ఉన్న సిబ్బందిని అత్యంత సమర్థవంతంగా వినియోగించుకుంటూ తనిఖీల వేగాన్ని పెంచనున్నారు.

జాతీయ దిన పత్రిక
తరంగాలు
THARANGALU DAILY NEWS
ఆదివారం, 19 జూలై, 2026


## భారత తుది జట్టులో మార్పులు

### తుది జట్టులోకి కేఎల్ రాహుల్




మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భాగంగా భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య ఆదివారం మూడో వన్డే జరగనుంది. తొలి వన్డేలో భారత్ గెలిస్తే.. రెండో వన్డేలో ఇంగ్లండ్ నెగ్గింది. దాంతో సిరీస్ విజేత మూడో వన్డేలో తేలనుంది. క్రికెట్ మక్కాగా పిలిచే లార్డ్స్‌లో ఈ పోరు జరగనుంది. , ఈ హై-వోల్టేజ్ మ్యాచ్‌కు ముందు భారత తుది జట్టులో మార్పులు జరిగే అవకాశం ఉంది. రెండో వన్డేకు దూరమైన కేఎల్ రాహుల్ మూడో వన్డే కోసం తుది జట్టులోకి వచ్చే అవకాశం ఉంది. అనారోగ్యం కారణంగా అతడు రెండో వన్డేకు దూరమయ్యాడు. అతడు ఫిట్‌గా ఉంటే మాత్రం మూడో వన్డే ఆడటం పక్కా. అదే జరిగితే ఇషాన్ కిషన్ పక్కకు తప్పుకోవాల్సిందే. ఇక మరో మార్పు కూడా జరగనుంది. రెండో వన్డే మ్యాచ్ ఆడుతున్న సమయంలో వాషింగ్టన్ సుందర్ తొడ కండరాల గాయానికి గురయ్యాడు. గాయం తీవ్రత దృష్ట్యా అతను మూడో వన్డేలో ఆడే అవకాశాలు లేవు. అతడి స్థానంలో హర్ష్ దూబే తుది జట్టులో ఆడతాడని బీసీసీఐ అధికారికంగా తెలిపింది. రెండో వన్డేలో వాషింగ్టన్ సుందర్ కూడా ఆశించిన స్థాయిలో ఆడలేదు. ఈ విషయాన్ని గిల్ పరోక్షంగా ప్రస్తావించాడు. ఇక ప్రిన్స్ యాదవ్‌ను ఆడించాలనుకుంటే మాత్రం ప్రసిధ్ కృష్ణ తప్పుకోవాల్సి ఉంటుంది. అయితే అది జరుగుతుందా లేదా అనేది చూడాల్సి ఉంది. ఇక మరోవైపు రోహిత్ శర్మపై కూడా చాలా వార్తలే నడుస్తున్నాయి. చివరి వన్డే అంటూ కొందరు.. అబ్బే అదేం లేదంటూ బీసీసీఐ ఖండించడం చకచకా జరిగిపోయాయి. ఇప్పటికే రోహిత్ శర్మ పేరెంట్స్ లండన్ చేరుకున్నారని సమాచారం. ఏదో జరుగుతుందని లేకపోతే పేరెంట్స్ ఎందుకు వెళ్తారంటూ సరికొత్త ప్రచారం మొదలైంది.

టీమిండియా తుది జట్టు (అంచనా): శుబ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్, శివమ్ దూబే, హర్ష్ దూబే, అక్షర్ పటేల్, బుమ్రా, గుర్నూర్ బ్రార్, ప్రసిధ్ కృష్ణ/ప్రిన్స్ యాదవ్

## జపాన్ ఓపెన్‌లో చరిత్ర సృష్టించిన పీవీ సింధు




భారత బ్యాడ్మింటన్ స్టార్, తెలుగు తేజం పీవీ సింధు జపాన్ ఓపెన్ సూపర్-750 టోర్నీలో చరిత్ర సృష్టించింది. ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీ చరిత్రలో ఫైనల్‌కు చేరిన తొలి భారత మహిళా షట్లర్‌గా సింధు అరుదైన ఘనత సాధించింది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో చైనాకు చెందిన మాజీ ఒలింపిక్ ఛాంపియన్ చెన్ యుఫీయ్‌ను ఓడించి సింధు ఫైనల్‌లో అడుగుపెట్టింది. రెండేళ్ల తర్వాత బీడబ్ల్యూఎఫ్ టూర్ ఫైనల్‌కు చేరడం కూడా సింధుకు ఇదే తొలిసారి కావడం విశేషం. సెమీఫైనల్లో సింధు ఆరంభం నుంచే దూకుడుగా ఆడింది. తొలి గేమ్‌లో చెన్ యుఫీయ్ నుంచి గట్టి పోటీ ఎదురైనా కీలక సమయంలో అద్భుత ఆటతో 21-19 తేడాతో గేమ్‌ను కైవసం చేసుకుంది. రెండో గేమ్‌లో కూడా ఆధిపత్యం కొనసాగించిన సింధు 15-10 ఆధిక్యంలో ఉండగా యుఫీయ్ హ్యామ్‌స్ట్రింగ్ గాయంతో ఇబ్బంది పడింది. చివరకు ఆమె రిటైర్డ్ హర్ట్‌గా మ్యాచ్ నుంచి తప్పుకోవడంతో సింధు విజేతగా నిలిచి ఫైనల్‌కు చేరుకుంది. ఈ విజయంతో సింధు మరో ముఖ్యమైన రికార్డును కూడా తన ఖాతాలో వేసుకుంది. చెన్ యుఫీయ్‌పై ఆమె చివరిసారి 2019లో విజయం సాధించింది. ఆ తర్వాత వరుసగా ఐదు మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. ఇప్పుడు జపాన్ ఓపెన్ సెమీస్‌లో గెలిచి ఆ పరాజయాల పరంపరకు తెరదించింది. దాదాపు ఏడేళ్ల తర్వాత యుఫీయ్‌పై మరోసారి విజయం నమోదు చేయడం సింధుకు ప్రత్యేకమైన మైలురాయిగా నిలిచింది. మ్యాచ్ ప్రారంభంలో యుఫీయ్ కొంత ఆధిక్యం సాధించినా సింధు వెంటనే పుంజుకుంది. వరుసగా నాలుగు పాయింట్లు సాధించి 10-5తో ముందంజ వేసింది. అయితే చైనా స్టార్ కూడా పోరాటాన్ని కొనసాగిస్తూ స్కోరును సమం చేసే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో ఇద్దరి మధ్య 51 షాట్లతో సాగిన సుదీర్ఘ ర్యాలీ ప్రేక్షకులను అలరించింది. మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగుతున్న సమయంలో స్కోరు 19-19 వద్ద సమమైంది. అలాంటి ఒత్తిడి పరిస్థితుల్లో సింధు తన అనుభవాన్ని ప్రదర్శించి వరుస రెండు పాయింట్లు సాధించి తొలి గేమ్‌ను గెలుచుకుంది. రెండో గేమ్‌లో సింధు మరింత దూకుడుగా కనిపించింది. నెట్ దగ్గర చురుకైన ఆటతో పాటు క్రాస్ డ్రాప్ షాట్లతో యుఫీయ్‌ను ఇబ్బంది పెట్టింది. విరామ సమయానికి 11-7తో ఆధిక్యంలో నిలిచిన సింధు, ఆ తర్వాత కూడా అదే జోరు కొనసాగించింది. స్కోరు 15-10 వద్ద ఉండగా యుఫీయ్ గాయం తీవ్రత పెరగడంతో మ్యాచ్‌ను కొనసాగించలేక వెనుదిరిగింది. ఈ విజయంతో పీవీ సింధు రెండేళ్ల నిరీక్షణకు ముగింపు పలికింది. ఆమె చివరిసారి 2024లో సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ టోర్నీలో ఫైనల్ ఆడి టైటిల్ గెలుచుకుంది. ఆ తర్వాత పలు టోర్నీల్లో మంచి ప్రదర్శనలు చేసినప్పటికీ ఫైనల్‌కు చేరలేకపోయింది. ప్రస్తుతం జపాన్ ఓపెన్‌లో ఫైనల్‌కు చేరడం ద్వారా మళ్లీ తన పాత ఫామ్‌ను అందుకుంటున్న సంకేతాలు ఇచ్చింది.

# రోహిత్ రిటైర్ ప్రచారంలో నిజం లేదు

### బీసీసీఐ ప్రధాన కార్యదర్శి దేవజిత్ సైకియా




తొలి రెండు వన్డేల్లో రోహిత్ శర్మ విఫలం అయ్యాడు. దాంతో అతడి రిటైర్మెంట్‌పై వార్తలు జోరుగా వచ్చాయి. మూడో వన్డే చివరిదంటూ కూడా వార్తలు వచ్చాయి. ఇప్పటికే బీసీసీఐ పెద్దలతో రోహిత్ శర్మ సమావేశం అయినట్లు.. వన్డే ప్రపంచకప్ 2027 ప్రణాళికల్లో రోహిత్ శర్మ లేనట్లుగా వార్తలు వచ్చాయి. ఇదే విషయాన్ని రోహిత్ శర్మకు బీసీసీఐ తెలిపినట్లు.. మూడో వన్డే అనంతరం రోహిత్ రిటైర్మెంట్ ప్రకటిస్తాడని వార్తలు వచ్చాయి. అయితే తాజాగా వీటిపై బీసీసీఐ క్లారిటీ ఇచ్చింది.భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, 'హిట్‌మ్యాన్' రోహిత్ శర్మ వన్డే క్రికెట్‌కు వీడ్కోలు పలకబోతున్నాడంటూ సోషల్ మీడియాలో వస్తున్న వార్తలపై భారత క్రికెట్ నియంత్రణ మండలి స్పష్టత ఇచ్చింది. ఇంగ్లాండ్‌తో లార్డ్స్ వేదికగా జరగనున్న మూడో వన్డే మ్యాచ్ తర్వాత రోహిత్ రిటైర్ అవుతాడంటూ జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదని బీసీసీఐ ప్రధాన కార్యదర్శి దేవజిత్ సైకియా స్పష్టం చేశారు. మీడియాలో వస్తున్నవన్నీ కేవలం అవాస్తవాలని ఆయన కొట్టిపారేశారు. రోహిత్ శర్మ భవిష్యత్తు గురించి జరుగుతున్న చర్చలపై దేవజిత్ సైకియా పీటీఐ వార్తా సంస్థతో మాట్లాడుతూ.. "ఆదివారం లార్డ్స్‌లో జరిగే మ్యాచ్ రోహిత్ కెరీర్‌లో చివరి మ్యాచ్ కాదు. జట్టు మేనేజ్‌మెంట్ కూడా ఆ దిశగా ఎలాంటి చర్చలు జరపలేదు. రోహిత్ భారత్ తరపున వన్డేల్లో కొనసాగుతాడు. రాబోయే సిరీస్‌లకు కూడా అతడు అందుబాటులో ఉంటాడు" అని తెలిపారు. వన్డే జట్టులో రోహిత్ రెగ్యులర్ సభ్యుడని, సోషల్ మీడియాలో వచ్చే ఊహాగానాలను అభిమానులు నమ్మవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. జట్టు ప్రణాళికల్లో ఉన్నంత కాలం రోహిత్ సేవలు టీమిండియాకు అందుతాయని స్పష్టం చేశారు.మరోవైపు, రోహిత్ శర్మ భవిష్యత్తుకు సంబంధించిన అంతర్గత సమాచారం మీడియాకు లీక్ కావడంపై బీసీసీఐ తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఎట్టి పరిస్థితుల్లోనూ జట్టుకు సంబంధించిన విషయాలపై మీడియాతో సంభాషించవద్దని బోర్డు సెలక్టర్లకు గట్టిగా సూచించింది. ఇప్పటికే టెస్టులు, టీ20 ఫార్మాట్లకు వీడ్కోలు పలికిన రోహిత్ శర్మ.. 2027 వన్డే ప్రపంచ కప్ గెలవడమే తన తదుపరి లక్ష్యంగా పెట్టుకున్నాడు. ఇప్పటికే కెప్టెన్‌గా టీ20 వరల్డ్ కప్, ఛాంపియన్స్ ట్రోఫీలను అందించిన రోహిత్, ఆటగాడిగా వన్డే ప్రపంచ కప్‌ను కూడా ముద్దాడాలని చూస్తున్నాడు. అయితే, 40 ఏళ్లకు చేరువవుతున్న రోహిత్ శర్మ స్థానంలో, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌ను వన్డే జట్టులో సిద్ధం చేయాలని హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ భావిస్తున్నట్లు ప్రచారం సాగింది. దీనికి తోడు గత రెండు వన్డే మ్యాచ్‌ల్లో రోహిత్ పెద్దగా రాణించకపోవడంతో, గంభీర్-రోహిత్ మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయని, అందుకే లార్డ్స్ వన్డే తర్వాత రోహిత్ వీడ్కోలు పలుకుతాడని ఊహాగానాలు జోరందుకున్నాయి. ప్రస్తుతానికి బీసీసీఐ ఇచ్చిన వివరణతో రోహిత్ భవిష్యత్తుపై అభిమానుల్లో ఉన్న అనుమానాలన్నీ పటాపంచలయ్యాయి.

# నేడే ఫిఫా ప్రపంచ కప్ ఫైనల్

### అర్జెంటీనాతో స్పెయిన్ ఢీ... అర్ధరాత్రి 12.30 నుంచి యునైటెడ్ 8 స్పోర్ట్స్, జీ5లో లైవ్





48 జట్లతో మొదలై.. 38 రోజులుగా యావత్ ప్రపంచాన్ని ఉర్రూతలూగించిన 103 హోరాహోరీ పోరాటాల తర్వాత సాకర్ ప్రపంచకప్ కథ క్లైమాక్స్‌కు చేరింది. క్రీడా జగత్తులోనే అత్యుత్తమైన ఫుట్‌బాల్ సింహాసనాన్ని అధిరోహించే అత్యున్నత దేశం ఏదో తేల్చే మహా సంగ్రామానికి సర్వం సిద్ధమైంది. ఒకవైపు మైదానంలో నిప్పులు చెరిగే అర్జెంటీనా ఆవేశం.. మరోవైపు ప్రత్యర్థిని ఉక్కిరిబిక్కిరి చేసే స్పెయిన్ వ్యూహాత్మక ఆటకు మధ్య న్యూజెర్సీ గడ్డపై అభిమానులకు అల్టిమేట్ కిక్ ఇచ్చే 'ఫైనల్ వార్' జరగనుంది. 39 ఏండ్ల వయసులో మరోసారి విశ్వవిజేతగా నిలవాలని కసిగా ఉన్న లియోనెల్ మెస్సీ ఆఖరి ప్రయత్నం.. బాల్యంలో అతడి చేతుల్లోనే ఒదిగిపోయి నేడు అదే దిగ్గజానికే సవాల్ విసురుతున్న స్పెయిన్ నయా సంచలనం లామిన్ యమాల్ ప్రతిఘటన.. ఈ ఫైనల్ పోరులో ప్రధాన ఆకర్షణగా మారాయి. మైదానం వెలుపల గురుశిష్యులైన ఇరు జట్ల కోచ్‌ల వ్యూహ ప్రతివ్యూహాల నడుమ జరగబోయే ఈ సాకర్ కురుక్షేత్రంలో గెలిచి.. ప్రపంచ కిరీటాన్ని కైవసం చేసుకునే అజేయ శక్తి ఏదో మరికొద్ది గంటల్లో తేలనుంది!

న్యూయార్క్: సాకర్ ప్రపంచంలోనే అత్యున్నత సమరానికి వేళయింది. భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి న్యూజెర్సీలోని మెట్‌లైఫ్ స్టేడియం వేదికగా జరగబోయే ఫిఫా ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ అర్జెంటీనా, యూరోపియన్ కింగ్ స్పెయిన్‌తో తలపడనుంది. మెస్సీ మ్యాజిక్‌తో వరుసగా రెండోసారి ట్రోఫీని ముద్దాడాలని అర్జెంటీనా పట్టుదలగా ఉంటే, 2010 తర్వాత తొలిసారి ఫైనల్ చేరిన స్పెయిన్ ఎలాగైనా విశ్వవిజేతగా నిలవాలని ఆశిస్తోంది.

**మెస్సీ జోరు.. అర్జెంటీనా అద్భుతాలు**

డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన అర్జెంటీనా జట్టులో 2022 టైటిల్ గెలిచిన 17 మంది ఆటగాళ్లు ఉన్నారు. అయితే ఈ టోర్నీలో అర్జెంటీనా ప్రయాణం అంత సులువుగా సాగలేదు. గ్రూప్ దశను అలవోకగా దాటినప్పటికీ నాకౌట్‌లో ప్రతీ మ్యాచ్‌లో కఠిన సవాల్‌ను ఎదుర్కొంది. అరంగేట్రం జట్టు కాబో వెర్డెపై ఎక్స్‌ట్రా టైమ్‌లో నెగ్గిన మెస్సీసేన ఈజిప్ట్, స్విట్జర్లాండ్, ఇంగ్లండ్‌పై కష్టపడి గెలిచి ఫైనల్ చేరింది. అయితే తీవ్ర ఒత్తిడిలో, ఓటమి అంచున నిలిచిన సమయాల్లో ఏమాత్రం వెనక్కుతగ్గకపోవడం..

అఖరి క్షణాల్లో వరుస గోల్స్ చేయడం అర్జెంటీనా అతిపెద్ద బలంగా మారింది. 39 ఏండ్ల వయసులోనూ మెస్సీ తన అద్భుతమైన గోల్స్, అసిస్ట్‌లతో జట్టును ముందుండి నడిపిస్తున్నాడు. టోర్నీలో ఇప్పటికే హ్యాట్రిక్ సహా 8 గోల్స్ కొట్టి కప్పుతో పాటు గోల్డెన్ బూట్ రేసులోనూ ముందున్నాడు. తన చివరి ప్రపంచకప్ మ్యాచ్‌ను ఒక అద్భుత విజయంతో ముగించాలని అతను పట్టుదలతో ఉన్నాడు.

**అజేయ శక్తి స్పెయిన్**

స్పెయిన్ ప్రస్తుతం ఓటమెరుగని పవర్‌హౌస్‌లా దూసుకెళ్తోంది. వరుసగా 37 మ్యాచ్‌ల్లో అజేయంగా నిలిచిన స్పెయిన్.. ఈ మ్యాచ్‌లో గెలిస్తే 2010 తర్వాత రెండో ప్రపంచకప్‌ను కైవసం చేసుకోవడమే కాకుండా, గతంలో 38 మ్యాచ్‌లతో ఇటలీ (2018-2021) నెలకొల్పిన అంతర్జాతీయ అజేయ రికార్డును బద్దలు కొడుతుంది. గ్రూప్ దశలో కాబో వెర్డెతో తొలి పోరును డ్రా చేసుకున్న తర్వాత రోడ్రి కెప్టెన్సీలోని స్పెయిన్ అసాధారణ ఆటతీరును చూపెడుతూ వరుసగా ఆరు మ్యాచ్‌ల్లో ఏకపక్ష విజయాలు అందుకుంది.

## భారత పతాకధారులుగా మీరాబాయి, లవ్లీనా

న్యూఢిల్లీ: కామన్వెల్త్ గేమ్స్ ప్రారంభవేడుకల్లో భారత పతాకధారులుగా వెయిట్ లిఫ్టర్ మీరాబాయి చాను, బాక్సర్ లవ్లీనా బొర్గొహైన్ వ్యవహరిస్తారని భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) శనివారం ప్రకటించింది.గ్లాస్గో వేదికగా ఈనెల 23న జరిగే ప్రారంభోత్సవంలో భారత బృందాన్ని ఒలింపిక్ పతక విజేతలైన చాను, లవ్లీనా ముందుండి నడిపిస్తారని ఐఓఏ అధ్యక్షురాలు పీటీ ఉష తెలిపింది. క్రీడల్లో పాల్గొనే భారత జట్టు మొత్తానికి ఆమె శుభాకాంక్షలు తెలియజేసింది.

